ప్రజాశక్తి
గురువారం 1 మే 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

టిడిపిలో చేరిన చీరాల మున్సిపల్ చైర్మన్

- టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో పార్టీలో చేరిన జంజనం



టిడిపిలో చేరిన మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు

ప్రజాశక్తి -చీరాల,బాపట్ల జిల్లా

చీరాల మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు వైసిపికి రాజీనామా చేసి టిడిపిలో చేరారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య సమక్షంలో బుధవారం ఆ పార్టీలో చేరారు. చైర్మన్ జంజనంపై టిడిపి కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం పెట్టారు. ఈ నేపథ్యంలో ఈనెల 14న ప్రత్యేక కౌన్సిల్ సమావేశం జరగనుంది. ఈ క్రమంలో జంజనం శ్రీనివాసరావు అనూహ్యంగా టిడిపిలో చేరారు. మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తికి ముఖ్య అనుచరుడిగా ఉన్న జంజనం గత స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి తరపున చీరాల మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. రాష్టంలో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక వైసిపికి చెందిన కొందరుద కౌన్సిలర్లు టిడిపిలో చేరి ఆయనపై అవిశ్వాస తీర్మానం కోసం ఎమ్మెల్యే మాలకొండయ్యపై ఒత్తిడి తెచ్చారు. కొంత సమయం వేచి చూసిన ఎమ్మెల్యే స్థానిక రాజకీయ పరిస్థితుల ▶ 2లో

హక్కుల కోసం

మళ్లీ పోరాటమే ఎజెండా

- లేబర్ కోడ్‌లు అమలు జరిగితే 12 గంటల పని
- ఇప్పటికే ఏళ్లతరబడి పిఆర్‌సిలు అమలుకాని వైనం
- నేడు కార్మికుల హక్కుల సాధన దినోత్సవం మేడే



ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

అనేక పోరాటాలు..ప్రాణత్యాగాల ఫలితం కార్మికవర్గం సాధించుకున్న హక్కులకు ఇపుడు పాలకుల విధానాల మూలంగా ముప్పువస్తోంది. సాధించుకున్న హక్కులు ఒక్కొక్కటిగా హరించుకు పోతున్నాయి. నూతన ఆర్థిక సరళీకృత విధానాలు దేశంలో అమలు మొదలయ్యాక ప్రవేటీకరణ చర్యలూ వేగవంత మయ్యాయి. ఒక్కో రంగలో చాపకిందనీరుగా ప్రవేటీకరణ మొదలైంది. ఖాళీల భర్తీ లేకుండాపోయింది. కాంట్రాక్టు ఉద్యోగుల నియా మకం తెరపైకి వచ్చింది. ఇపుడు ఇదే అన్ని శాఖల్లో ఉంది. ఈ పద్ధతిలో నియ మించిన ఉద్యోగ కార్మికులకు ఎలాంటి హక్కులు,సౌకర్యాలు లేవు. వాటి గురించి ప్రస్తావనేలేదు. ఫలితంగా అనేక రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికులకు భద్రత లేకుండా పోయింది. ఇపుడు ఉన్నవాటిని కాపాడు కునేందుకు పోరాటాలు చేయాల్సి వస్తోంది. వేతనాలు, హక్కుల కోసం ఉద్య మించాల్సిన పరిస్థితులు చూస్తున్నాం. ఎన్నికల సమయాల్లో ఇచ్చే హామీలు ఏమీ అమలు కావడం ▶ 2లో

పిడుగుపడి చెలరేగిన మంటలు

ప్రజాశక్తి-కంభం

బుధవారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఈదురు గాలులు, పిడుగులతో బీభత్సం సృష్టించింది. కంభం మండలంలోని రావిపాడు గ్రామంలో శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలోని మండపంపై పిడుగు పడి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాదవశాత్తూ ఆ సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. విషయం తెలుసుకున్న ప్రజలు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. అలాగే కంభం గ్రామంలో తెలుగు వీధి, చెరువు కట్టకు పోయే దారిలో అక్కడక్కడా పెద్ద పెద్ద చెట్లు విరిగిపడ్డాయి. అక్కడ కూడా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కంభం గ్రామంలో కొన్ని గంటల పాటు విద్యుత్తుకు అంతరాయం కలిగింది. విద్యుత్ శాఖ అధికారులు విరిగిపడిన చెట్లను తొలగింపజేశారు. తెగిన విద్యుత్ తీగలను సవరింపజేశారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా సమస్యలను వెంటనే పరిష్కరించడంతో కంభం ప్రజలు విద్యుత్, అగ్నిమాపక శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.


పిడుగు పడి మండపంపై చెలరేగుతున్న మంటలు

బీభత్సం సృష్టించిన ఈదురు గాలులు

రాచర్ల: రాచర్ల మండలం అక్కపల్లె, అనుములవీడు, గౌతవరం, అనుములపల్లె గ్రామాల్లో బుధవారం సాయంత్రం గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గాలివాన కారణంగా అనుములవీడు గ్రామంలో పొగాకు షెడ్లు కూలిపోయాయి. అక్కపల్లి టూ తురిమెళ్ల రోడ్డులో వేప చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో రాకపోకలకు, విద్యుత్ సరఫరాకు కొంత అంతరాయం కలిగింది. సంబంధిత అధికారులు హుటాహుటిన భద్రతా చర్యలు చేపట్టి పరిస్థితి చక్కపెట్టారు.


తురిమెళ్ల టూ అక్కపల్లె రోడ్డులో రోడ్డుకడ్డంగా పడ్డ చెట్టు

హక్కుల కోసం..
మళ్లీ పోరాటమే ఎజండా

(మొదటి పేజీ తరువాయి)

లేదు. అనేక శాఖల్లో ఖాళీలు భర్తీ కానందున ఉన్నవారిపై అదనపు పనిభారం పడుతోంది. కేంద్రప్రభుత్వం నూతనంగా తెస్తోన్న లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులు ప్రపంచ వ్యాప్తంగా పోరాటం చేసి సాధించుకున్న 8 గంటల పని ఎగిరిపోనుంది.12 గంటలు పని చేయాల్సి వస్తోంది. లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు పోరాటాలు సాగిస్తున్నారు. ప్రభుత్వ రంగంలోనే కాకుండా ప్రైవేటు రంగాల్లోనూ పనిగంటలు అమలు కావడం లేదు. పగలూ రాత్రి అనే తేడా లేకుండా కార్పోరేట్ సంస్థలు ఉద్యోగులతో పని చేయించు కుంటున్నాయి. లక్షలాది మంది పనిచేస్తున్న ఈ రంగంలో కనీస హక్కులు కూడా లేవు.అడిగితే ఇంటికి పోవాల్సిందే.కారణం పాలకులు కార్మికులు కోసం ఈపాటికే ఉన్న చట్టాలను సవరించి కార్పొరేట్‌లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయి. ఇంకా ఆందోళనకరమైన విషయం మేమిటంటే మేడే రోజున అనేక శాఖల్లో సెలవు రద్దు చేశారు.ఎప్పటి నుంచో మేడే రోజున సెలవు ఉంటుంది. కార్మికులు కార్యాలయాల ముందు ఎర్రజెండాలు ఎగరేసి సాధించుకున్న హక్కులను మననం చేసుకుంటారు. బ్యాంకులు, ఎల్‌ఐసి,పోస్టల్, టెలికం రంగాల్లో సెలవు ఎత్తేశారు. ఇక వేతన సవరణలు ఏళ్ల తరబడి పెండింగులో ఉన్నట్లు ఉద్యోగులు వాపోతున్నారు. కేంద్రం పదేళ్లగా 8వ వేతన సవరణ చేయాల్సి ఉంది.రాష్ట్ర ప్రభుత్వం కూడా 12 వేతన సవరణను 2023 నుంచి పెండింగులో పెట్టింది. ఇక స్కీము వర్కర్లు జిల్లాలో 10వేల మంది ఉన్నారు. వీరికి కనీస వేతనం రూ.26 వేలు అమలు కావడం లేదు. అంగన్‌వాడీలు, ఆశాలు, మధ్యాహ్నం భోజనం కార్మికులు, ఆర్‌పిలు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఇలా అనేక రంగాల్లో వెట్టిచాకిరి చేస్తున్నారు. నేషనల్‌హెల్త్ మిషన్ ఆయుష్మాన్ భారతిలో పనిచేస్తున్న ఉద్యోగులు కూడా ఆందోళనలు చేస్తున్నారు. ఇక పారిశ్రామిక వాడల్లో ఎక్కడా కార్మిక చట్టాలు అమలు కావడం లేదు. జిల్లాలో గ్రానైట్, ఆక్వా, పొగాకు, ప్రాసెసింగ్ యూనిట్లు, జిన్నింగు మిల్లులు అనేక రంగాల్లో కార్మిక చట్టాలు అమలు కావడంలేదు. పర్యవేక్షణ లేదు. రోజువారీ పనులు చేసుకునే భవన నిర్మాణరంగంలోనూ ఏ చట్టాలు లేవు. ట్రాన్స్‌పోర్టు రంగంలోనూ ఇదే పరిస్థితి.ఎక్కడా భద్రత లేదు. వేతనాలు సకాలంలో పెంచడం లేదు. ఆందోళనలు చేస్తే తప్ప గ్రానైట్ కార్మికులకు వేతనాలు పెంచడం లేదు. సమ్మెలు ఏటా తప్పడం లేదు. సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేసే కార్మికులకు చట్టాలు అమలు కావడం లేదు. పనిచేసే చోట్ల ఏం జరిగినా పట్టించుకునే పరిస్థితి లేదు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులూ తమ హక్కులు, సౌకర్యాలు కోసం ఆందోళనలు ఏటా చేస్తూనే ఉన్నారు. అన్నిశాఖల ఉద్యోగులు, కార్మికులు నిరంతరం ఆందోళన బాట పడుతూనే ఉన్నారు. కారణం ఈపాటికే ఉన్న సౌకర్యాలు పోతున్నాయి. భద్రతలేదు.మేడే సందర్భంగా ఉద్యోగులు, కార్మికులు తమ హక్కులు సౌకర్యాలను మరోసారి మననం చేసుకుని వాటిని కాపాడుకునేందుకు పోరాటాలే ఎజండాగా సాగాల్సిన తరుణం ఆసన్నమైంది.


మట్టి నమూనాలు సేకరిస్తున్న దృశ్యం

మట్టి నమూనాల సేకరణపై అవగాహన

ప్రజాశక్తి-పుల్లలచెరువు

మండల కేంద్రమైన పుల్లలచెరువులో వ్యవసాయాధికారి పి నిర్మలాదేవి ఆధ్వర్యంలో బుధవారం మట్టి నమూనాలు సేకరించడం గురించి రైతులకు అవగాహన కల్పించారు. మండలానికి ఒక్కో రైతు సేవా కేంద్రం పరిధిలో 56 చొప్పున 102 శాంపిల్స్‌ను కేటాయించారని తెలిపారు. మట్టి నమూనాల ఫలితాలను తెలుసుకొని రైతులు పంటలు సాగు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎండిన చెట్లతో ప్రమాదం

ప్రజాశక్తి-టంగుటూరు

జరుగుమల్లి మండలంలోని వావిలేటిపాడు వద్ద ఆర్‌అండ్‌బి రోడ్డు మార్జిన్‌లో భారీ చెట్లు ప్రమాదకరంగా మారాయి. నేల బారున వరిగిన కొమ్మలు అధిక బరువుతో పడిపోయే ప్రమాదం ఉన్నందున, వర్షాకాలంలో తొలగించాలని జరుగుమల్లి ఎంపీడీవో యం.వి. రమణమూర్తి ఆర్‌అండ్‌బి ఏఈని అడిగి ఐదు నెలలు అవుతోంది. గత సంవత్సరం నవంబరు నెలలో భారీ వర్షాలకు చెట్లు కొమ్మలు విరిగి ఎవరి మీద పడి ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని, భారీ వృక్షాలు తొలగించాలని కోరుతూ ఆర్‌అండ్‌బి ఏఈకి తెలిపారు. ఈ వృక్షాలను ఈఓపిఆర్‌డి ఎడు కొండలు, పంచాయతీ కార్యదర్శి కిషోర్ బాబు తో కలిసి భారీ చెట్లను పరిశీలించారు. నేటికి చెట్లు తొలగించేందుకు ఆర్‌అండ్‌బి శాఖ వారు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఎండి పోయిన చెట్లు కొమ్మలతో ప్రమాదం పొంచి వుంది. ఈ విషయమై ఆర్‌అండ్‌బి ఏఈ మాధవరావుని వివరణ కోరగా ఎండి పోయిన చెట్టు కొమ్మలు, రోడ్డు మీద బారీగా పెరిగిన చెట్ల కొమ్మలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ వారికి తెలపడం జరిగిందన్నారు. వారి నుంచి సమాధానం వచ్చిన వెంటనే తొలగించేందుకు చర్యలు చేపడతామని తెలిపారన్నారు. ఈ విషయమై స్పందించే వారు కరువయ్యారని జరుగుమల్లి తెలుగు దేశం పార్టీ నాయకులు కొండూరి శివ కోటి రెడ్డి తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత శాఖా అధికారులు స్పందించి రోడ్డుకి అడ్డంగా ఉన్న భారీ చెట్లు, ఎండి పోయిన చెట్లు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


ఆర్అండ్ బి రోడ్డు వద్ద వరిగిన భారీ వృక్షాలు


వావిలేటి పాడు ఆర్అండ్‌బి రోడ్డు వద్ద వరిగిన భారీ చెట్టు

టిడిపిలో చేరిన చీరాల మున్సిపల్ చైర్మన్

(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో అవిశ్వాసం కోసం అంగీకారం తెలిపారు. మెజారిటీ కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌ను కలిసి అవిశ్వాస తీర్మానం పెట్టాలని లేఖ ఇచ్చారు. ఈనెల 14న కౌన్సిల్ సమావేశం కోసం నోటీసులు ఇచ్చారు. రాజధాని ప్రాంత చేనేత పెద్దలు అవిశ్వాసం వద్దంటూ జంజనం తరపున టిడిపి అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ పెద్దలు, చేనేత నాయకులు టిడిపిలో చేరేలా జంజనం శ్రీనివాసరావును ఒప్పించారు. దీంతో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే మాలకొండయ్య,రాష్ట్ర కార్యదర్శి నాతాని ఉమామహేశ్వరరావు సమక్షంలో జంజనం టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎం.సుధాకర్, బాల తదితరులు పాల్గొన్నారు.

అందరినీ కలుపుకుని ముందుకెళ్తా : జంజనం

శ్రేయోభిలాషులు, చేనేత పెద్దల అభీష్టం మేరకు తాను వైసిపికి రాజీనామా చేసి టిడిపిలో చేరినట్లు చీరాల మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు తెలిపారు. గతంలో తాను టిడిపి తరపున చీరాల నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసినట్లు తెలిపారు. తర్వాత చీరాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా భాధ్యతలు చేపట్టానన్నారు.కొంత విరామం తరువాత తిరిగి టిడిపిలో చేరానన్నారు. అందరినీ కలుపుకుని ముందుకెళ్తానని ఆయన తెలిపారు. టిడిపి బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే మాలకొండయ్య సహకారంతో పట్టణాభివృద్ధికి మరింత కృషి చేస్తానని జంజనం తెలిపారు.

'ప్రైవేటు'లో 25శాతం సీట్లు ఉచితం

ప్రజాశక్తి-పుల్లలచెరువు

ప్రైవేటు పాఠశాలల్లో అర్హత కలిగిన పేద విద్యార్థులకు 25 శాతం ఉచితంగా సీట్లు మంజూరు చేపడతామని ఎంఈవో ఇందిర ప్రసాద్ తెలిపారు. అర్హత కలిగి ఐదు సంవత్సరాలు నిండి ఒకటో తరగతిలో చేరబోయే విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 2వ తేదీ నుంచి రిజిస్టర్ చేసుకోవాలని ఆమె తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

పాల్గొన్న 538 మంది కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు



మోకాళ్లపై నిల్చొని నిరసన తెలియజేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ (కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు)ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవ అధ్యక్షుడు కాలం సుబ్బారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. బుధవారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పథకంలో పని చేస్తున్న మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవవైడర్స్‌ను రెగ్యులర్ చేయాలని, ఎన్హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి యంసిఎ ప్రకాశం జిల్లా నాయకత్వంలో నిరవధిక సమ్మె చేపట్టారు. కలెక్టరేట్ వద్ద రెండో రోజు చేపట్టిన ఈ సమ్మెలో జిల్లా వ్యాప్తంగా 538 మంది సిబ్బంది మోకాళ్లపై నిరసన వ్యక్తం చేసారు. ఈ సమ్మెకు యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) మద్దతు ప్రకటించింది. సంఘ నాయకులు సుబ్బారావు మాట్లాడుతూ బీఎస్సీ నర్సింగ్ నుంచి పిహెచ్‌డి వరకు ఉన్నత విద్య చదివినప్పటికీ వారు చేస్తున్న ఉద్యోగానికి భద్రత లేకపోవడం దారుణమన్నారు. ఒక నిర్దిష్టమైన పని లేకుండా రకరకాల పనులు చేయిస్తూ పనిభారం పెంచారన్నారు. కేంద్రం ఇచ్చిన ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం 6 సంవత్సరాలు పనిచేసిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెగ్యులర్ చేయాలని కోరారు. మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) జిల్లా కోశాధికారి జి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ సంజీవని, టెలి మెడిసిన్ సేవలు, గర్భిణీలు, టీబి రోగులు ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ఎవరూ కూడా బాధపడకుండా వారికి సౌకర్యాలు అందించాలని అనుకుంటే వెంటనే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ సమస్యలను పరిష్కారం చేసి వారి సమ్మెను విరమింప చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు . ప్రభుత్వం సమస్యలు పరిష్కారం చేయకపోగా రెచ్చగొట్టే చర్యలు చేపట్టిందని ఈ వైఖరి సరైంది కాదని విమర్శించారు. యూనియన్ నాయకులు ఎం.రాజేష్, ఎన్.నిరంజన్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం చర్చలు ద్వారా సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ ఎపియంసిఎ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యంరాజేష్, అసోసియేషన్ ప్రకాశం జిల్లా ప్రెసిడెంట్ ఎ.నిర్మల, జిల్లా వైస్ ప్రెసిడెంట్ జీవన జ్యోతి, ప్రకాశం జిల్లా సెక్రటరీ ప్రసన్న, సయ్యద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ సుమన్

కారు బోల్తా: వ్యక్తి మృతి

ప్రజాశక్తి-సిఎస్.పురం

మండలంలోని కంభంపాడు గ్రామానికి సమీపంలో కారు అదుపుతప్పి బోల్తాపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. మండలంలోని అరివేముల గ్రామానికి చెందిన బాణాల కృష్ణ (42) పామూరు నుంచి కారులో స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యంలో కంభంపాడు సమీపంలో కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో కృష్ణ అక్కడికక్కడే మృతి చెందారు. కారు పల్టీలు కొట్టడంతో కారు నుజ్జునుజ్జయింది. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ ఆర్.సుమన్ సంఘటన స్థలాన్ని, ప్రమాదం తీరును పరిశీలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.


పోస్టర్‌లు ఆవిష్కరిస్తున్న అధికారులు

బాల్యవివాహాలు అరికట్టాలి

ఎంపీడీవో షేక్ మహబూబ్ బాషా

ప్రజాశక్తి-వెలిగండ్ల

బాల్య వివాహాలు అరికట్టాలని ఎంపీడీవో షేక్ మహబూబ్ బాషా అన్నారు. బుధవారం ఐసీసీడీఎస్ ప్రాజెక్టు అధికారి గంధం కృపావరం అధ్యక్షతన కిశోర వికాసం సర్వే నిర్వాణపై అంగన్వాడి, ఆశ, వెలుగు విఏవో సచివాల మహిళా పోలీసులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో మహబూబ్ బాషా మాట్లాడుతూ వేసవి సెలవుల్లో కిషోర్ బాలికలు బడి లోపల బడి బయట ఉన్నటువంటి కౌమార దశ బాలికలను గుర్తించి వారికి వివిధ అంశాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ఐసిపిఎస్ లీగల్ ఆఫీసర్ బి.రత్నప్రసాద్, డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీలక్ష్మి ప్రదం, జిల్లా కోఆర్డినేటర్ ప్రసన్న వెంకటలక్ష్మి మాట్లాడారు. బంగారు బాల్యం కిశోర వికాసం పోస్టర్లు, బుక్లెట్లను ఆవిష్కరించారు.

సిఎస్.పురం: ప్రస్తుత సమాజంలో బాల్యవివాహాలను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల విద్యాశాఖ అధికారి ప్రసాదరావు తెలిపారు. సిఎస్ పురంలోని 4వ అంగన్‌వాడీ కేంద్రంలో కిషోరి వికాస శిక్షణ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమం మహిళాభివృద్ధి శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడి టీచర్లకు, ఆశావర్కర్లు ఎంఎస్కేల్ విఓలు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ శిక్షణలో ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు ఆరోగ్యం, రుతుస్రావంలో పాటించవలసిన శుభ్రత, బాల్య వివాహ నిరోధక చట్టం ఫోక్సో, యాక్ట్ బాల్య వివాహాల నివారణ వ్యక్తిగత ఆత్మరక్షణ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి మురళి, యాక్టివ్ సూపర్‌వైజర్ సరళరెడ్డి, ఎమ్మెస్‌కేలు హరిత, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-శింగరాయకొండ

ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలని బిసి కార్పొరేషన్ ఈడి ఎం.వెంకటేశ్వరావు అన్నారు. శింగరాయకొండ వెలుగు కార్యాలయంలో బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అక్కడ మహిళలకు ఇస్తున్న శిక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇస్తున్న ఈ శిక్షణ ద్వారా ప్రతి మహిళ గ్రామాల్లో కుట్టు శిక్షణ కేంద్రాలు పెట్టుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. శిక్షణ పొందుతున్న ప్రతి మహిళను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో డి.జయమణి ఉన్నారు.

కనిగిరిలో నిలిచిన పొగాకు వేలం

గిట్టుబాటు ధర కల్పించాలని రైతుల ఆందోళన


నిరసన తెలియజేస్తున్న పొగాకు రైతులు

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పొగాకు వేలం కేంద్రంలో వేలం ప్రక్రియ నిలిచిన సంఘటన బుధవారం ఉదయం చోటు చేసుకుంది. కనిగిరి పొగాకు వేలంకేంద్రం పరిధిలోని గ్రామాలకు చెందిన పొగాకు రైతులు తాము పండించిన పొగాకుకు సంబంధించిన బేళ్లను విక్రయించుకునేందుకు కనిగిరి పొగాకు వేలంకేంద్రంకు తీసుకురావడం జరిగింది. పొగాకు వేలం ప్రక్రియ ప్రారంభం అయిన వెంటనే హైగ్రేడ్ తప్ప లోగ్రేడ్ పొగాకును కొనుగోలు చేసేందుకు ప్రైవేట్ కంపెనీల బయ్యర్లు ముందుకు రాకపోవడంతో రైతులు నిరాశకు గురయ్యారు. వేలం ప్రక్రియ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ఇంతవరకు లోగ్రేడ్ పొగాకు కొనుగోలు చేసేందుకు బయర్లు ముందుకు రాకపోవడం మరియు బోర్డు అధికారులు చొరవ చూపకపోవడంతో రైతులు వేలం ప్రక్రియను నిలిపివేసి ఆందోళన వ్యక్తం చేశారు. మద్దతు ధర కల్పించడంతోపాటు లోగ్రేడ్ పొగాకును కూడా కొనుగోలు చేయాలని నినాదాలు చేస్తూ నిరసన తెలియజేశారు.


పోలీసులను మోహరించిన టోల్ గేట్ యాజమాన్యం

మేడే జండా ఆవిష్కరణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు టోల్ ప్లాజా కార్మికులు 16వ రోజు నిరసన తెలియచేస్తూ డిమాండ్స్ కోసం పోరాడుతు మే డే సందర్భంగా జెండా ఆవిష్కరణ కోసం ఏర్పాటు చేస్తుండగా టోల్ ప్లాజా యాజమాన్యం అడ్డుకుంది. పోలీసులను పిలిపించి అడ్డుకొనే ప్రయత్నం చేస్తుండగా కార్మికులు ఐక్యంగా ఉండటం వలన జెండా ఆవిష్కరణకి అనుమతి ఇవ్వటం జరిగింది. దీంతో పోలీసులు వెను దిరిగి వెళ్లారు. దీనికి సీఐటీయూ టంగుటూరి రాము టోల్ ప్లాజా యూనియన్ ప్రెసిడెంట్ తిరుమల రావు, సెక్రటరీ కాశీ విశ్వనాథ్ , ప్లాజా మహిళా కార్మికులు సుమ, శతి, కళ్యాణి, పూర్ణదేవి, వసంతలక్ష్మి పాల్గొన్నారు.

కామేపల్లి రహదారి గుంతలమయం

రాళ్లు లేచి ప్రమాదకరంగా మారిన వైనం

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు


రాళ్లు లేచి ఇబ్బందిగా మారిన తారు రోడ్డు

ప్రజాశక్తి-టంగుటూరు

జరుగుమల్లి మండలంలోని వావిలేటిపాడు నుంచి కామేపల్లి వరకు ఉన్న ఆర్అండ్‌బి రోడ్డు అడుగుకో గుంతతో మరమ్మత్తులకు గురయింది. పైడిపాడు రామచంద్రాపురం గ్రామంలో రోడ్డుపై రాళ్లు లేచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రామచంద్రాపురం నుంచి నర్శింగోలు గ్రామాల మధ్య ఉన్న డబుల్ రోడ్డు అడుగుకో గుంత కనిపిస్తుంది. బైక్‌లు ఈ రోడ్డు పై ప్రయాణించాలంటే సర్కస్ చేయాల్సిందే అని వాపోతున్నారు. ఈ గ్రామాల మధ్య ఉప్పువాగు వద్ద రోడ్డు ఛిద్రమై రాళ్లు పైకి లేచి రాక పోకలకు ఇబ్బందిగా మారింది. కమ్మవారిపాలెం-చిరికూరపాడు మధ్య ఉన్న శీతలగిడ్డంగి వద్ద ఆర్అండ్‌బి రోడ్డు బాగా ధ్వంసమైంది. ద్విచక్రవాహనదారులు, కార్లు, బస్సులు ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ఇబ్బందిగా మారిందని వాహన చోదకులు తెలుపుతున్నారు. రామచంద్రాపురం వద్ద ఉప్పువాగుపై ఉన్న ఆర్అండ్‌బి రోడ్డు వద్ద గుంతలు పూడ్చాలని ప్రయాణీకులు కోరుతున్నారు.


జెండా ఊపి రథాన్ని ప్రారంభిస్తున్న దేవతి బ్రదర్స్

దర్శిలో శాంతిరథం ప్రారంభం

ప్రజాశక్తి-దర్శి

దర్శిలో మానవతా సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా కీర్తిశేషులు దేవతి వెంకటసుబ్బయ్య, హనుమాయమ్మ కుమారులు దేవతి వరప్రసాద్, భాస్కర, మహానంద, రామారావుల ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన శాంతిరథాన్ని బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో డిప్యూటీ తహశీల్దార్ వెంకటేశ్వర్లు, సబ్ జైలర్ వి.రమణ, డాక్టర్ మణిశేఖర్‌లు సంయుక్తంగా జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అంతకుముందు మానవతా సంస్థ జిల్లా కార్యదర్శి మానవతా సంస్థ యొక్క విధివిధానాల గురించి సభలో వివరించారు. ఈ సభకు దేవతి వరప్రసాద్ అధ్యక్షత వహించగా పలువురు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో దర్శి చైర్మన్ ధన్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, కన్వీనర్ కపురం శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి వేణు, డైరెక్టర్లు, మానవతా సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవతి వరప్రసాద్, మహానంది, రామారావులను ఘనంగా సన్మానించారు. అనంతరము గడియార స్తంభం సెంటర్ వరకు రథంతో ర్యాలీగా మానవతా సభ్యులందరూ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భైరవకోనలో దుకాణాలకు వేలం


వేలం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-సిఎస్.పురం

జిల్లాలో ప్రఖ్యాత పర్యాటక పుణ్యక్షేత్రమైన భైరవకోనలో వివిధ షాపుల నిమిత్తం నిర్వహించుకొనుటకు జరిగిన వేలం పాటలో రూ.41,17,000 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి వంశీకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం భైరవకోనలో దేవాదాయ ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ సమక్షంలో బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. గత ఏడాది 27 లక్షల 91 వేలు ఆదాయం రాగా ఈ ఏడాది 13 లక్షల 25 వేల రూపాయలు అదనంగా ఆదాయం రావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ముప్పాళ్ళ శ్యాంసుందర్‌రాజు, భైరవకోన ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ గుంటిమడుగు వెంకటరామరాజు, మద్దులూరి శ్రీనివాసరాజు, ముద్దులూరి వెంకటరాజు, ముప్పాళ్ళ శ్రీనివాసులురాజు, రుద్రరాజు, రాజేంద్రరాజు, అర్చక బృందం, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు రైతులకు వ్యవసాయ శాఖ భరోసా

◆ పొగాకును తక్కువ ధరకు అమ్ముకోవద్దు ◆ మార్కెఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వెల్లడి



పొగాకు కంపెనీలతో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - ఇంకొల్లు

నల్లబర్లి పొగాకు సాగుచేసిన రైతులెవరు పొగాకు తక్కువ ధరకు అమ్ముకోవద్దని వ్యవసాయ అధికారులు తెలిపారు. పర్చూరు ఎడిఎ రామ్మోహనరావు తోపాటు ఇంకొల్లు ఎఒ ఆదినారాయణ గుంటూరులో పొగాకు బోర్డు అధికారులు, కంపెనీల ప్రతినిధులతో వ్యవసాయ శాఖ మంత్రి ఆధ్వర్యంలోనిర్వహించిన సమావేశం వివరాలు బుధవారం తెలిపారు. శాసన సభ్యులు ఏలూరు సాంబశివ రావు ఆధ్వర్యంలో లామ్ ఫామ్ గుంటూరులో పొగాకు బోర్డు చైర్మన్, ఇడి, నల్లబర్లీ కొనుగోలు చేసే కంపెనీ జిపిఐ ఐటిసి, డకన్, అలిన్స్, యూనివర్సల్ పొగాకు కంపెనీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారని తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు ఆధ్వరలో నల్లబర్లీ ధరల పతనంపై చర్చించినట్లు తెలిపారు. రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నట్లు తెలిపారు. పొగాకు కంపెనీలను అడిగి పొగాకు ధరల పతనంపై అధికారులు, మంత్రులు చర్చించారు. పొగాకు కొనుగోలు సంస్థలు వారికున్న ఎక్స్‌పోర్ట్ ఆర్డర్ కంటే ఎక్కువ విస్తీర్ణంలో పంట సాగు చేసినట్లు తెలిపారు. పంట ఉత్పత్తి 70నుండి 75 మిలియన్ల పొగాకు రైతుల దగ్గర ఉందని పొగాకు కంపెనీలు తెలిపాయి. జిపిఐ కంపెనీ ప్రతినిధి రూ.12500కు ఒక క్వింటాల్ కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. అంత కంటే ధర తగ్గనీయకుండా పొగాకు కొనుగోలు చేస్తామని తెలిపారు. కావున పొగాకు సాగు చేసిన రైతులెవరు తక్కువ ధరకు బయట వ్యాపారులకు అమ్ముకోవద్దని చెప్పారు. రైతులు పండించిన పొగాకు పంటను అంత కొనుగోలు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు, శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావుకు పొగాకు కొనుగోలు సంస్థలు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఒక వేళ పొగాకు సంస్థలు కొనుగోలు చేయకపోతే ప్రభుత్వం మార్కుఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తుందని పొగాకు సంస్థలను హెచ్చరించినట్లు తెలిపారు. ఏలూరు సాంబశివరావు చొరవతో పొగాకు కొనుగోలు సంస్థలతో ఏర్పాటు చేసిన మీటింగ్ మంచి ఫలితాలు ఇస్తుందని ఆశిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



రైతుల వద్ద నిల్వ ఉన్న పొగాకు



పెట్రోల్ బంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

పెట్రోల్ బంకు ప్రారంభం

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్ల, సూర్యలంక బీచ్‌రోడ్డులో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు ఏర్పాటు చేసిన ముప్పలనేనీస్ ఫిల్లింగ్ స్టేషన్ (పెట్రోల్ బంక్)ను ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు చీరాల గోవర్ధన్ రెడ్డి, బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్, నామన వెంకట శివన్నారాయణ, యార్లగడ్డ లక్ష్మీ నారాయణ, టిడిపి పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, ముప్పలనేని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో చైర్మన్ కట్ట మంగ

ఎజెండా ఏకగ్రీవంగా ఆమోదం

ప్రజాశక్తి - రేపల్లె

కౌన్సిల్ సమావేశం అజెండాలో ప్రతిపాదించిన 27 అంశాలు ఏకగ్రీవంగా ఆమోదించారు. రూ.1.17కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు ఆమోదించారు. మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్‌పర్సన్ కట్ట మంగ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ పట్టణంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ప్రస్తావించారు. సమావేశంలో వైస్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ విశ్వనాథ్ గుప్తా, మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు, సానిటరీ ఇన్స్‌పెక్టర్ రామచంద్రరావు, ఎఇలు రోహిణి, జాన్ శామ్యూల్, మేనేజర్ శివప్రసాద్, మున్సిపల్ ఆర్ఒ రత్నాంజలి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - అద్దంకి

క్షయ వ్యాధిగ్రస్తులకు సమీపంలో నివసించేవారు, తోటి కుటుంబ సభ్యులు, ఇతర అనుమానితులు, ఇతర ఆరోగ్య సేవా సిబ్బందికి ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా స్క్రీనింగ్ పరీక్ష గాజులపాలెం యుపిహెచ్సి నందు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గొట్టిపాటి విజయ సింహ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా కొత్త పరీక్షను ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో అందుబాటులోకి తీసుకురావడం ప్రశంసనీయమని అన్నారు. గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు చేరువ చేసేందుకు ప్రభుత్వాలు తీసుకొస్తున్న పథకాలు ఎంతో ఉపయోగమని అన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం వల్ల జబ్బులను ముందుగానే గుర్తించి వైద్య సేవలు అందిస్తే పేదల ఆరోగ్యం ప్రాణాపాయ స్థితి నుండి కాపాడవచ్చని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీకా నియంత్రణ జిల్లా అధికారి డాక్టర్ మనోజ్ ప్రొద్యోత్, టిబి సూపర్వైజర్ ఎం శ్రీనివాసరావు, వెంకాయమ్మ పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో వీల్‌చైర్లు పంపిణీ

ప్రజాశక్తి - పర్చూరు

రోటరీ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన ఐదుగురికి వీల్‌చైర్లు బుధవారం పంపిణీ చేశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్, పిడుగురాళ్ల రోటరీ క్లబ్ లైం సిటీ సహకారంతో సమకూర్చిన ఐదు వీల్‌చైర్లను గవర్నర్ కె శరత్‌చౌదరి, బాలకోటిరెడ్డి, విష్ణుబాబు, కెఎస్ఆర్‌కె ప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. వీల్‌చైర్లను జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని చెప్పారు. రోటరీ క్లబ్ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని, దాతలు ముందు రావాలని కోరారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు తోకల కృష్ణమోహన్, కోమటి ఆంజనేయులు, నాగుబడి సుబ్బారావు, నాగబైరు శ్రీనివాసరావు, కోట శ్రీనివాసరావు, కొల్లా నరేంద్ర కుమార్, భవనం రాజగోపాలరెడ్డి, గడ్డిపాటి శ్రీనివాసరావు, మున్నంగి వెంకటసుబ్బయ్య, పోలిశెట్టి చంద్రం, పంబి సదానందరెడ్డి, కాల్వ సత్యనారాయణ పాల్గొన్నారు.



వీల్ చైర్లు పంపిణీ చేస్తున్న రోటరీ ప్రతినిధులు

డిమాండ్ల సాధన కోసం సిహెచ్‌ఒల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి - బాపట్ల

రెండేళ్లుగా ప్రభుత్వం చెల్లించాల్సిన జీతాల కోసం కమ్యూనిటీ హెల్త్ అధికారులు చేపట్టిన సమ్మె బాపట్లలో బుధవారం రెండో రోజుకు చేరింది. ప్రభుత్వం నుండి తమకు రావలసిన జీతభత్యాలు చెల్లించి తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె విరమించేది లేదని సిహెచ్‌ఓలు తేల్చి చెప్పారు. సమ్మెకు నాయకత్వం వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ సంఘం జిల్లా నాయకురాలు త్రినయని మాట్లాడుతూ రెండేళ్లుగా జీతాలు అందక ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఎన్నిసార్లు ప్రభుత్వానికి, సంబంధిత శాఖకు మొరపెట్టుకున్న తమ సమస్యలు పట్టించుకున్న వారు లేరని అన్నారు. అందుకోసం తప్పనిసరి పరిస్థితుల్లో నిరవధిక సమ్మెకు పూనుకోవాల్సి వచ్చిందని అన్నారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు ఎంతకాలమైనా తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె విరమించేది లేదని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎన్ రాజు, దీపక్, కుమార్ రాజా, కృపానిధి, రత్నకుమారి పాల్గొన్నారు.



జిల్లా కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న సిహెచ్‌ఒలు

స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు ఆదరించండి

ప్రజాశక్తి - బాపట్ల

స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన అనేక ఆహార, ఇతర ఉత్పత్తులను కొనుగోలు చేసి మహిళలకు ఆర్థిక స్వాలంబన కల్పించాలని సిటీ మిషన్ మేనేజర్ ఎం సుబ్రహ్మణ్యం అన్నారు. ఎస్‌హెచ్‌జి మహిళలు తయారు చేసిన అనేక ఉత్పత్తులను మెప్మా అర్బన్ మార్కెట్ ద్వారా ప్రదర్శన విక్రయ కేంద్రాలను బుధవారం పాత బస్టాండ్ ఆటో స్టాండ్ వద్ద ఏర్పాటు చేశారు. డ్వాక్రా గ్రూపులకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందించే రుణాలతో వ్యాపారాలు, హస్త కళల వంటి కళాకృతులు తయారుచేసి వాటి విక్రయాల ద్వారా స్వయం ఉపాధి పొందు తున్నారని అన్నారు. ప్రజలు వాటిని ఆదరించాలని అన్నారు. స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహించేందుకు మెప్మా అర్బన్ మార్కెట్ ద్వారా ఆయా ఉత్పత్తులు కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా జిల్లా అధ్యక్షురాలు అక్కల నాగ వరలక్ష్మి, సిడిలు నవకాంత్, విజయలక్ష్మి, మేరీ, సిఓలు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.



మెప్మా ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయం



బాధితులను పరామర్శిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

పలువురికి మంత్రి గొట్టిపాటి పరామర్శ

ప్రజాశక్తి - అద్దంకి

ఇటీవల పట్టణంలో ఘట్టమనేని కోటయ్య, ఆర్ఎంపి వైద్యులు చిన్నపల్లి శ్రీనివాసరావు, కంచర్ల వాసు అనారోగ్యంతో మరణించగా వీరి కుటుంబాలను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని ద్వారకానగర్‌లో రూ.4.50 కోట్లతో నూతనంగా నిర్మించనున్న 33/11 కెవి సబ్ స్టేషన్‌కు, ఎన్ఎస్‌పి కాలనీ ప్రాంగణంలో రూ.6.73 కోట్లతో నూతనంగా నిర్మించనున్న సెమీ ఇండోర్ సబ్ స్టేషన్‌కు, సింగరకొండ రోడ్డులో రూ.2.25 కోట్లతో నిర్మించనున్న ఫైర్ స్టేషన్‌కు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఇమ్యూనైజేషన్ అధికారిగా రత్నమన్మోహన్

ప్రజాశక్తి - బాపట్ల

జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిగా డాక్టర్ చుక్కా రత్న మన్మోహన్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రోగ్రాం మానిటరింగ్ అధికారిగా బాధ్యతలు నిర్వహించిన ఆయన బదిలీపై బాపట్లకు వచ్చారు. పలువురు వైద్యాధికారులు, జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయ సిబ్బంది ఆయనకు సాదర స్వాగతం పలికారు.



చుక్కా రత్న మన్మోహన్

డ్రగ్స్ నివారణకు అవగాహనే ఏకైక మార్గం

- విద్యాసంస్థల్లో ఈగిల్ క్లబ్‌లు ఏర్పాటు
- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నివారణకు ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడమే ఏకైక మార్గమని కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. డ్రగ్స్ వినియోగంతో కలిగే దుష్ఫలితాలను పెద్ద ఎత్తున వివరించడమే కాకుండా, జిల్లాలో పూర్తిస్థాయి నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి నార్కోటిక్స్ కంట్రోల్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్‌ను పూర్తి స్థాయిలో నివారించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. అందులో భాగంగా విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేయాలన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఈగిల్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఔషధ నియంత్రణాధికారులు సంయుక్తంగా మందుల షాపులను తనిఖీ చేయాలని


మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఆదేశించారు. ఫిర్యాదులు చేసేందుకు ఏర్పాటు చేసిన 1972 టోల్ ఫ్రీనెంబర్‌పై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు.

గంజాయి అరికట్టేందుకు పటిష్ట చర్యలు : ఎస్‌పి

జిల్లాలో ఎక్కడా గంజాయి పంట సాగు జరగడం లేదని, జిల్లా మీదుగా రవాణా జరుగుతోందని, అరికట్టేందుకు పటిష్టమైన చర్యలను తీసుకున్నామని ఎస్‌పి దామోదర్ తెలిపారు. నమోదు చేసిన కేసుల సంఖ్యే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. డ్రగ్స్ సరఫరా, వినియోగం కూడా శిక్షార్హమేనని తెలిపారు. గంజాయి, డ్రగ్స్ వినియోగం కలిగే దుష్ప్రభావాలపై పాఠశాలలు, కళాశాలల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మైనింగ్ పనుల కోసం ఇతర ప్రాంతాల నుంచి కూలీలు జిల్లాకు వస్తుంటారని, సంబంధిత పరిశ్రమల యాజమాన్యం వారిని సమన్వయం చేసుకొని కూలీల పై నిఘా ఉండేలా మైనింగ్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. డ్రగ్స్ వినియోగం, సరఫరాకు సంబంధించి 283 మందిని గుర్తించినట్లు తెలిపారు. కళాశాలల్లో ఈగిల్ టీమ్‌లు, డ్రాప్ బాక్సులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్కూల్స్, కాలేజ్, హాస్టల్స్, దాబాలలో, ఇంజినీరింగ్, మెడికల్ కాలేజ్‌లలో బోర్డులు.. మత్తు పదార్థాల నివారించే చర్యలపై పోస్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం డ్రగ్స్ నియంత్రణ పై రూపొందించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్‌పి కె.నాగేశ్వరరావు, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్, డిఆర్ఒ బి.చిన ఓబులేసు, ఒంగోలు ఆర్‌డిఒ కె.లక్ష్మీ ప్రసన్న, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జమున, ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏడుకొండలు, సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మా నాయక్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్ పరీక్షలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(పాలిసెట్) బుధవారం ప్రశాంతంగా జరిగింది. పరీక్ష కోసం ఒంగోలు నగరంలో ఏడు, మార్కాపురంలో నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పరీక్షకు మొత్తం 4,600 మంది విద్యార్థులగానూ 3950 మంది హాజరయ్యారు. 650 మంది గైర్హాజరయ్యారు. బాలుర 2.832 మందికి గానూ 2,557 మంది విద్యార్థులు హాజరయ్యారు. బాలికలు 1668 మందిని కేటాయించగా 1393 హాజరయ్యారు. పరీక్షలో 85.86 శాతం హాజరు నమోదు అయింది. పాలిసెట్ పరీక్షను రాష్ట్ర పరిశీలకులు దేవానంద్, కోఆర్డినేటింగ్ సెంటర్ పరిశీలకులు, నెల్లూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుంచి రాంప్రసాద్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగాఒంగోలు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ శివ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో పాలిసెట్ పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగిందన్నారు.

3న సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఉమ్మడి ప్రకాశం జిల్లా సబ్ జూనియర్స్ బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక కందుకూరు టిఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఈనెల 3న మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ఛైర్మన్ డాక్టర్ కంచర్ల రామయ్య, ప్రెసిడెంట్ వలేటి రవీంద్ర, కార్యదర్శి తొట్టెంపూడి సుబ్బారావు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనేందుకు 2012 జనవరి 1న పుట్టిన వారు అర్హులన్నారు. బాలబాలికలు పుట్టిన తేదీ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు చిత్తూరులో ఈనెల 15 నుంచి 18 వరకూ నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారన్నారు. మరిన్ని వివరాలకు 9866126955, 944078 4735, 984929839 సెల్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఫొటోగ్రఫీలో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు రూడ్ సెట్ సంస్థలో ఈనెల 20 నుంచి 30 రోజుల పాటు ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు ఉమ్మడి ఒంగోలు జిల్లా గ్రామీణ ప్రాంతాలకు చెందిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. శిక్షణకు హాజరయ్యే వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి ఉచితంగా కల్పిస్తామని తెలిపారు.వివరాలకు 9573363141 సెల్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

నవజాత శిశువుల

సంరక్షణ కేంద్రాల్లో మౌలిక వసతులు : కలెక్టర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రభుత్వ ఆసుపత్రులలో నవజాత శిశువుల సంరక్షణ కేంద్రాలు (ఎంఎన్‌సియు) ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కలెక్టర్ తమీమ్ అన్సారియా వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ వైద్యాధికారులతో


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

బుధవారం సమావేశం నిర్వహించారు. జిల్లా లోని గిద్దలూరు, యర్రగొండపాలెం, కొండపి, మార్కాపురం, రిమ్స్ ఆసుపత్రుల్లో నవజాత శిశువుల సంరక్షణ కేంద్రాలు (ఎంఎన్‌సియు) ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత మెడికల్ అధికారులతో సమీక్షించి సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాత మరణాలు తగ్గించడం, పుట్టిన బిడ్డలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే నవజాత శిశువుల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు ప్రధాన ఉద్దేశమన్నారు. కనిగిరి ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన విధంగా నవజాత శిశువుల సంరక్షణ కేంద్రాన్ని గిద్దలూరు, యర్రగొండపాలెం, కొండపి, మార్కాపురం, రిమ్స్ ఆసుపత్రుల్లో ఏర్పాటుకు ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలన్నారు. అందుకు సంబంధించిన పనులను సత్వరం పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ శ్రీనివాస నాయక్, ఎపిఎంఎస్ఐడిసి ఇఇ నిర్మల్ కుమార్, కమ్యూనిటీ ఎంపవర్మెంట్ ల్యాబ్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ ప్రతినిధి శ్రావ్య, గిద్దలూరు, యర్రగొండపాలెం, కొండపి, మార్కాపురం, ఆసుపత్రుల వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యం సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

సుదీర్ఘ కాలం పాటు పోలీస్ శాఖకు విశేష సేవలు అందించడం అభినందనీయమని అడిషనల్ ఎస్‌పి టిపి. విఠలేశ్వర్ కొనియాడారు. పోలీస్ శాఖకు 34 సంవత్సరాలపాటు విశేష సేవలను అందించి ఉద్యోగ విరమణ చేసిన ఎఎస్ఐ దాసరి సుబ్రహ్మణ్యంను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని వీసీ హాల్‌లో అడిషనల్ ఎస్‌పి పూలమాలలు, దుశ్శాలువాతో సన్మానించారు. దాసరి సుబ్రహ్మణ్యం 1990లో ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎఆర్ కానిస్టేబుల్‌గా నియమితులయ్యారు. 2005లో ఎఆర్ నుంచి సివిల్ కు కన్వర్షన్ అయ్యారు. సిఐడి, కోస్టల్ సెక్యూరిటీ ఫోర్స్ లతో పాటు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించారు. కానిస్టేబుల్ నుంచి ఎఎస్ఐ వరకూ పదోన్నతులు పొంది ప్రస్తుతం బాపట్ల స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. 34 సంవత్సరాల పాటు పోలీస్ శాఖకు చేసిన సేవలకు గాను ప్రభుత్వం నుంచి మొత్తం 120 రివార్డులు, సేవ పథకం అందుకున్నాడు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్‌పి



ఎఎస్ఐ సుబ్రహ్మణ్యం దంపతులను సన్మానిస్తున్న ఎఎస్‌పి

మాట్లాడుతూ సుబ్రహ్మణ్యం పోలీస్ శాఖలో 34 సంవత్సరాల పాటు అంకితభావంతో విధులు నిర్వహించి ఎఎస్ఐ స్థాయిలో ఉద్యోగ విరమణ చేయడం అభినందనీయమన్నారు. ఉద్యోగ విరమణ తరువాత శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని సూచించారు. ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఆహ్లాదకరంగా గడపాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి విజయ సారథి, ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ నారాయణ, అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'కమ్మవారి సేవా సమాఖ్య'

రాష్ట్ర అధ్యక్షుడిగా మండవ మురళీకృష్ణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్


మండవ మురళీకృష్ణ

'కమ్మవారి సేవా సమాఖ్య- ఆంధ్రప్రదేశ్' రాష్ట్ర అధ్యక్షుడిగా మండవ మురళీకృష్ణ ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమ్మ పెద్దలు ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర కమ్మ సామాజికవర్గం అవసరాల దష్ట్యా కమ్మవారి సేవాస మాఖ్య-ఆంధ్రప్రదేశ్ పేరిట ఓ ట్రస్టును ఏర్పాటుచేశారు. ఈ ట్రస్టుకు గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ గని భాస్కరరావు, అధ్యక్షుడిగా మండవ మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి రమేష్ చంద్ర, కోశాధికారిగా గూడూరి నాగ కోటేశ్వరరావు, కార్యదర్శిగా సూరపనేని స్వరూపరాణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సిఎంఎం సస్పెన్షన్

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

మెప్మా ఒంగోలు నగర సిటీ మిషన్ మేనేజర్ జి.కల్పనను సస్పెండ్ చేస్తూ ఆ శాఖ మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కల్పన సిటీ మిషన్ మేనేజర్‌గా చేరినప్పటి నుంచి ఆమె మీద పలు అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పలువురు డ్వాక్రా సంఘం సభ్యులు గత నెలలో ఆ శాఖ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదుపై విచారణ చేపట్టిన మెప్మా ప్రకాశం జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీహరి ఆమెను కొద్దిరోజులు క్రితం ఉన్నతాధికారుల వద్ద సరెండర్ చేశారు. మొత్తం వివరాలు సేకరించిన ఉన్నతాధికారులు బుధవారం ఆమెను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ

ఏడీగా మోహన్ రాజు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా



జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా టి.మోహన్ రాజు బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. మోహన్ రాజు బాపట్ల జిల్లా ఏర్పడినప్పటి నుంచి డివిజనల్ పౌర సంబంధాల అధికారిగా రెండేళ్ల పాటు బాపట్ల జిల్లాలో పనిచేశారు. 2024 జనవరిలో జిల్లా పౌర సంబంధాల అధికారిగా ఉద్యోగోన్నతిపై నెల్లూరు జిల్లాకు వెళ్లారు. గత నవంబర్‌లో డిప్యూటేషన్ పై బాపట్ల జిల్లా పౌర సంబంధాల అధికారిగా ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం బాపట్ల జిల్లా సమాచారశాఖకు పూర్తి అదనపు బాధ్యతల పై అసిస్టెంట్ డైరెక్టర్ గా ప్రభుత్వం నియమించింది. జిల్లా సమాచారం పౌర సంబంధాల అధికారి వారి కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మోహన్‌రాజుకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో కార్యాలయ సీనియర్ సహాయకులు పద్మావతి, జూనియర్ సహాయకులు రవి ,సుభాని,కిరణ్ తదితరులు ఉన్నారు.

గ్రామ కమిటీ అధ్యక్షుడిగా 'గుర్రం'

ప్రజాశక్తి-సిఎస్ పురం

మండలంలోని నల్లమడుగుల గ్రామ టిడిపి అధ్యక్షుడిగా గుర్రం వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సూరిపోగు కొండయ్య, ప్రధాన కార్యదర్శిగా షేక్ ఖాజావలి, బూత్ కన్వీనర్‌గా గుర్రం నాగేశ్వరరావు, ఎస్.కొండయ్యలను ఎన్నుకున్నారు. మండలంలోని నల్లమడుగుల గ్రామంలో టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుల ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, మండల క్లస్టర్ ఇన్‌చార్జి నాగిశెట్టి చినమాలకొండయ్య, సీనియర్ నాయకులు అట్లూరి రామకృష్ణంరాజు, యూనిట్ ఇన్‌చార్జి కొనంగి వెంకట కొండయ్య, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐక్యవేదిక నాయకులు

కాల్పుల విరమణ ప్రకటించాలి

ప్రజాశక్తి - చీరాల

కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరిపి అమాయకులైన ఆదివాసులపై మావోయిస్టుల పేరుతో జరుపుతున్న కాల్పులు తక్షణమే విరమణ ప్రకటించి శాంతి చర్చలకు సంకేతాలు ఇవ్వాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు అన్నారు. పట్టణంలో ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మావోయిస్టులతో కేంద్రం శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ శాంతి ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర చేనేత జన సమాఖ్య వ్యవస్థాపకులు డాక్టర్ మాచర్ల మోహనరావు ర్యాలీని ఉద్దేశించి మాట్లాడారు. మధ్య భారత దేశ రాష్ట్రాలైన తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, చత్తీస్ గడ్, ఒరిస్సా రాష్ట్రాల్లో విస్తరించిన ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలపై కేంద్ర ప్రభుత్వం దారుణ మారణకాండ కొనసాగించడం ద్వారా భారత పౌరులను హతమారుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విదేశీ బహుళ జాతి సంస్థలకు దోచిపట్టడం కోసం రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నల్లబోతుల మోహన్ కుమార్ ధర్మ, శీలం రవికుమార్, ఊటుకూరు వెంకటేశ్వర్లు, కొత్తపేట మాజీ సర్పంచ్ చుండూరి వాసు, ముస్లిం లీగ్ నాయకులు షేక్ బషీర్ అబ్దుల్లా, చేనేత నాయకులు దేవన వీర నాగేశ్వరరావు, మేడిన వెంకటరెడ్డి, గుంటూరు మల్లికార్జున్, దళిత బహుజన పార్టీ షేక్ జిలానీ, యానాది సంఘాల నాయకులు మానికల పోలీస్, పద్మ, ఏలియా, కనకయ్య, దళిత నాయకులు సత్యానందం, గోసాల అశోక్, ఆదివాసీలు, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

షర్మిల హౌస్ అరెస్టు దుర్మార్గం

ప్రజాశక్తి - అద్దంకి

ఎపి కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడం దుర్మార్గమైన చర్యని కాంగ్రెస్ ఇన్చార్జ్ కిషోర్ బాబు అన్నారు. అరెస్టును కాంగ్రెస్ తీవ్రంగా ఖండి స్తుందన్నారు. ఇంటి నుండి పార్టీ కార్యాలయానికి వెళ్లకుండా పోలీసులు అడ్డు కోవడం అప్రజాస్వామికం, ప్రభుత్వ దుర్నీతికి నిదర్శనమని పేర్కొన్నారు. రాజధాని ప్రాంతం విజయవాడలోనే ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం దురదృష్ట కరమని అన్నారు. గన్నవరంలోని తన నివాస గృహం నుండి విజయవాడలోని పార్టీ కార్యాలయానికి వెళ్లడానికి ప్రభుత్వ అనుమతి, వీసా, పాస్పోర్ట్ తీసుకోవాలాని అన్నారు. జగన్ ప్రభుత్వాన్ని మించి నిర్బంధాల డబల్ ఇంజన్ సర్కార్ నిర్బంధం విధిస్తుందని అన్నారు.

చోరీ సొత్తు రికవరీ చేయట్లేదు

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటానికి ఎంత ఖర్చవుతుందో తగిన ప్రతిపాదనలు సిద్ధం చేసి తీసుకురావాలని పోలీస్ అధికారులను మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. ఇటీవల ఒంగోలులో వీరయ్య హత్య కేసును సోదాహరణంగా వివరిస్తూ హంతకులను, దొంగలను ముందుగా గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని అన్నారు. అందుకోసం పట్టణం మొత్తం సీసీ కెమెరాలతో బంధించాలని పోలీసులను ఆదేశించారు. బెంగళూరు గ్రీన్ఫీల్డ్ హైవేలో భూ నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వడంలో జరుగుతున్న జాప్యాన్ని సరిచేయాలని జిల్లా అధికారులకు ఫోన్ ద్వారా సూచించారు. అద్దంకి, పంగులూరు మండలాల పరిధిలో వంద మంది పైబడి రైతులకు నష్టపరిహారం అందలేదని మంత్రి దృష్టికి రైతులు తీసుకరావడంతో స్పందించిన మంత్రి జిల్లా అధికారులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఆదేశించారు. డిప్లమో పూర్తిచేసిన నిరుద్యోగులకు విద్యుత్ శాఖలో ఉద్యోగ నియమాకానికి తన వంతు ప్రయత్నం చేస్తానని అన్నారు. అలాంటివారు అప్లై చేసి తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈపాటికే 25 మంది పైబడి విద్యుత్ శాఖలో చేర్చుకున్నట్లు తెలిపారు.

ఈ గుంతల రోడ్డులో ప్రయాణం ఎట్లా?


రాళ్లుతేలి ప్రమాదకరంగా మారిన పూనూరు రోడ్డు

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని పూనూరు, గన్నవరం గ్రామాల మధ్య ఆర్ అండ్ బి రోడ్డు చాలా చోట్ల పెద్ద గుంటలు పడ్డాయి. ఈ రోడ్డులో ప్రయాణం నరకాన్ని తలపిస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో చాలా రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. రోజులు గడుస్తున్నా రోడ్ల పరిస్థితులు మాత్రం మారడం లేదు.

గుంటలకు మట్టయినా తోలండి

పూనూరు గ్రామానికి చెందిన బోయపాటి కృష్ణ మాట్లాడుతూ రోడ్లు దుర్భరంగా ఉన్నాయి. ఈ రోడ్లలో ప్రయాణం చేస్తున్న వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపాడు. ద్వి చవాహనం మీద ప్రయాణించాలంటే బయపడాల్సి వస్తుందని అన్నాడు. గన్నవరం నుండి పూనూరుకు మధ్య ఉన్న 3 కిలోమీటర్లు కొద్ది దూరానికి ద్విచక్ర వాహనంపై 30 నిముషాలకుపైగా సమయం పడుతుందని ఆవేదనగా తెలిపాడు. రోడ్డులో ప్రయాణం తర్వాత నడుం నొప్పితో బాధ పడుతున్నామని అన్నారు. రోడ్డులో గుంటలకు కనీసం ఎర్రి మట్టయినా తోలి గుంటలు సరిచేయాలని కోరుతున్నారు.


బోయపాటి కృష్ణ, పూనూరు

రోడ్డులో గుంటలు పూడ్చండి

ద్వి చక్ర వాహనదారుడు మార్పు వంశీ మాట్లడుతూ ఈ రోడ్డుపై ప్రయాణిస్తుంటే ద్విచక్ర వాహనాలు తరచు మరమ్మత్తులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గుంటల వల్ల ప్రయాణానికి ఎక్కువ సమయం పడుతుందని చెప్పాడు. రోడ్డులోని గుంటలను సరిచేసి ప్రాయానానికి అనుకూలంగా చేయాలని కోరారు.


మార్పు వంశీ, వాహన చోదకుడు

సినీఫక్కీలో భారీ చోరీ

- పోలీసులు అదుపులో ఇద్దరు నిందితులు
- 117 సవర్ల బంగారం, రూ.1.60 లక్షల నగదు అపహరణ


ఘటనా స్థలంలో్న పరిశీలిస్తున్న ఎస్ఐ రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలో భారీ చోరీ జరిగింది. ఈ ఘటన మంగళ వారం అర్ధ రాత్రి వన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో పువ్వాడవారివీధిలో చోటు చేసుకుంది. అసోసియేషన్ బిల్డింగ్ సమీపంలో నివాసం ఉంటున్న ఓ కళాశాల కరస్పాండెంట్ మువ్వల ప్రసాదరావు దంపతులు ఉడ్నగర్లోని రమేష్ హాస్పటల్కు అనారోగ్యంతో వైద్యం నిమిత్తం వెళ్ళి వచ్చేలోపు దుండగులు ఇంటి వెనుక డోర్ నుంచి వెళ్లి దొంగతనానికి పాల్పడ్డారు. ఇంటి కబోర్డులో దాచిన 117 సవర్లు బంగారు ఆభరణాలు, రూ.1.60 లక్షల నగదు అపహరించుకుపోయారు. దుండగులు సినీ ఫక్కీలో చోరీ చేసిన చోట ఎలాంటి ఆనవాలు లభించకుండా కారం చల్లి వెళ్ళిపోయారు. జరిగిన ఘటనపై బాధితులు పోలీసులకు సమాచారం అందించారు. బుధవారం క్లూస్ టీం రంగంలోకి దిగింది. ఆధారాలు సేకరించారు. ఒకటో పట్టణ ఎస్ఐ రాజ్యలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దుండగులు దొంగతనానికి పాల్పడి బంగారు ఆభరణాల బ్యాగుతో పారిపోతున్న దృశ్యాలు సిసి కెమెరాల్లో నమోదయ్యాయి. పోలీసులు సిసి పుటేజి ఆధారంగా, బాధితులకు అత్యంత దగ్గరగా ఉన్న పలువురిని విచారించి ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. కేసు దర్యాప్తులో భాగంగా గతంలో బాధితుల ఇంటిలో పనికివచ్చిన వారే చోరికి పాల్పడ్డట్లు గుర్తించారు. ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇదిలా ఉంటే హాస్పటల్కి వెళ్లి వచ్చే గంట వ్యవధిలో చోరీ జరగటంపై స్థానికులు కొంత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే పోలీసులు హుటా హుటీని కేసు దర్యాప్తు చేసి నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం అందటంతో ఆ ప్రాంతవాసులు ఊపిరి పీల్చుకున్నారు. పూర్తి వివరాలు పోలీసు దర్యాప్తులో తెలియాల్సి ఉంది.



సిసి పుటేజ్లో నమోదైన దుండగుల చిత్రాలు

రైడ్కి పరిశీలనకు తేడా తెలియదా..

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఎలాంటి అనుమతి లేని బార్ షాపలను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెపుతుంటే వైన్స్ షాపుల పక్కన కూర్చుని తాగితే తప్పేంటని టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా అనటం పట్ల వైసిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక బస్టాండు వద్ద ఉన్న వైన్ షాపు ద్వారా మహిళలు, ప్రయాణికులకు ఇబ్బందిగా ఉన్న దృష్ట్యా ఆ వైన్ షాపును వైసీపీ ఇన్ఛార్జి వరికూటి అశోక్ బాబు పరిశీలన చేయడం పట్ల సాయిబాబా ఆరకాల ఆరోపణ చేశారు. దీంతో వైసీపీ నాయకులు సాయిబాబా వ్యాఖ్యలను ఖండించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలపై సాయిబాబాకు, టిడిపి అధినా యకునిపై, పార్టీ సిద్ధాంతాలపై గౌరవం లేనట్టే కదా? అన్నారు. దీన్ని బట్టి సాయిబాబా మనస్తత్వం ఏమిటో ప్రజలు గమనించుకోవాలని వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి సయ్యద్ సిరాజుద్దీన్ అన్నారు. మద్యం బాబులు పట్ల మహిళలు తమ ఇబ్బందులు వరికూటి అశోక్ బాబుకు తెలపటంతో ప్రతిపక్ష నాయకునిగా పర్మిట్ షాపుల పరిశీలనకు వెళితే అవాకులు చవాకులు పేలటం విడ్డూరంగా ఉందన్నారు. కుందేటి రమేష్, ఎంపీపీ డివి లలిత కుమారి, ఎంపిటిసి కె పద్మావతి, సయ్యద్ నభి, గోలి శ్రీనివాసరావు, డి నాగ మల్లేశ్వర రావు, కుక్కల భూషణరావు, టి యలమంద, వి చిన్నారి, వి నాగేశ్వరావు, లింగం శ్యామ్ సుందర్, లింగం శ్రీను, కె ప్రసాద్, కోటయ్య, జంపాని రవి, రావుల బుజ్జి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సయ్యద్ సిరాజుద్దీన్


మిన్నేకల్లు వడ్డెరకాలనీలో నిలిచిన మురుగు నీరు

పడకేసిన పారిశుధ్యం

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని మిన్నేకల్లు గ్రామ వడ్డెర కాలనీలో పారిశుధ్యం పడకేసింది. కాలనీలోని వీధుల్లో సైడ్ కాలువలు లేకపోవడంతో ఇండ్ల లోని మురికి నీరు వీధుల వెంట తిష్ట వేసింది. దీంతో అటుగా పోయే పాదచారులకు దుర్వాసన వెదజల్లుతుంది. పంచాయతీ అధికారులు ఆ వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలనీలో 50 కుటుంబాలపైగా నివసిస్తున్నారు. వీధుల్లో మురికి నీరు తిష్టవేసి అంటు రోగాలు ప్రబలుతున్నాయని అన్నారు. ఇప్పటికైనా పంచాయితీ అధికారి తమ వీధులను పరిశీలించి పారిశుధ్య పనులు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.


మాట్లాడుతున్న రేపల్లె సిడిపిఒ ఎం సుచిత్ర

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - రేపల్లె

సమాజంలో బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని సీడీపీఓ ఎం సుచిత్ర అన్నారు. మండలంలోని పేటేరు పంచాయతీలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. 18ఏళ్ల నిండిన అమ్మాయికి, 21ఏళ్ల నిండిన అబ్బాయికి వివాహం చేయాలని అన్నారు. అంతకన్న చిన్న వయసులో చేయడం వల్ల అమ్మాయిలకు ఆరోగ్య సమస్యలు, పుట్టే పిల్లలకు పౌష్టికాహార లోపంతో ఉంటారని అన్నారు. చిన్నప్పుడే వివాహం చేయడం వల్ల చదువు ఆగిపోతుందని అన్నారు. దాని వల్ల భవిష్యత్ పాడై ఆర్థిక ఇబ్బందులు వస్తాయని అన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి దాసరి శ్రీనివాసరావు, ధనుంజయరావు, సురేష్, పి నటరాజ్, ఎంఎస్కెలు, అంగన్వాడి కార్యకర్తలు, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంకొల్లు : బాల్య వివాహాలు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన శిక్షలు తప్పవని ఐసిడిఎస్ సూపర్వైజర్ కొల్ల వాణి అన్నారు. స్థానిక పోలిమేర ఆంజనేయస్వామి గుడి వద్ద బాలల పరిరక్షణ శాఖ సిబ్బంది శ్రీప్రియ, రాఘవ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. 18ఏళ్లలోపు ఆడపిల్లలకు వివాహాలు నిర్వహిస్తే వధూవరుల తల్లిదండ్రులతో పాటు నిర్వహించే పూజారి, బ్యాండు, అలంకరణ సిబ్బందితోపాటు వివాహంలో పాల్గొన్న పలువురికి శిక్షలు తప్పవని అన్నారు. అక్షయ తృతీయ సందర్భంగా ఆలయాల్లో వివాహాలు నిర్వహిస్తుంటారని, అందువలన అవగాహన కోసం సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్, పూజారులు మాట్లాడుతూ గత పదేళ్లుగా ఇక్కడ బాల్య వివాహాలు ఎప్పుడు నిర్వహించలేదని తెలిపారు.

పిఎసిఎస్లో అపరాల కొనుగోలు కేంద్రం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

భట్టిప్రోలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో మినుములు, పెసల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎఒ ప్రసన్నలక్ష్మి తెలిపారు. మరో వారం రోజుల్లో తెల్లజొన్న కొనుగోలు కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మద్దతు ధర రూ.3,375లకు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రానున్న ఖరీఫ్ సీజన్ పచ్చిరొట్ట విత్తనాల కొరకు ఆయా రైతు సవ కేంద్రాల్లో ముందస్తుగా నమోదు చేయించుకోవాలని అన్నారు. ఏ విధంగా భూసార పరీక్షల నిమిత్తం మట్టి నమూనా చేపట్టడం జరుగుతుందని రైతులు తమ వివరాలు వ్యవసాయ సహాయకులకు అందజేసి భూసార పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

అనాథలుగా మారిన చిన్నారులు

● రెండేళ్ల క్రితం తండ్రి, ఇప్పుడు తల్లి మృతి ● ప్రభుత్వమైనా ఆదుకోవాలని కుటుంబ సభ్యులు మొర

ప్రజాశక్తి -మర్రిపూడి

మర్రిపూడి మాదిగ పల్లెలో బుధవారం తెల్లవారు జామున కొండ్రు మౌనిక (29)అనే మహిళ ఆకస్మికంగా మృతి చెందారు. ఆమె భర్త షడ్రక్ (32) 2023 ఏప్రిల్ నెల 16న అనగా రెండేళ్ల క్రితం ఆకస్మికంగానే మృతి చెందాడు. దీంతో వారి పిల్లలు ముగ్గురు తల్లి, దండ్రులను కోల్పోయి అనాథలయ్యారు. ఈ ఘటనతో ఒకసారిగా గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. పెద్ద కుమారుడు అరవింద్ 7వ తరగతి, రెండవ కుమారుడు మేషక్ 5వ తరగతి, కుమార్తె రూబిక 2వ తరగతి చదువుతున్నారు. తల్లిదండ్రుల ఆలనా పాలనలో అభం శుభం తెలియని ముగ్గురు పిల్లలు అనాథలుగా మారడంతో గ్రామం అంత ఒక్కసారిగా శోకసముద్రంలో మునిగిపోయింది. మృతురాలు మౌనిక మేనత్త చిన్ననాటి నుండి ప్రేమగా పెంచుకున్న మౌనిక పిల్లలను చూసి మృతదేహం దగ్గర కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. తల్లిదండ్రులను గుర్తుపట్టలేని, ఊహ తెలియని వయసులో వీరిని వదిలి తల్లి, దండ్రులు వెళ్లిపోవడంతో ఈ అమాయక పిల్లలు ఎలా బ్రతకాలో దేవుడా అంటూ మేనత్త గజ్జ దానమ్మ కన్నీటి రోధనలు చూపరులను కంటతడి పెట్టించాయి. ఆమె తన భర్తను కోల్పోయినప్పటికీ తన వంతుగా మేనకోడలు కుటుంబం కోసం పోరాటం చేసి ఇంతవరకు నెట్టుకొచ్చింది. దీంతో ఈ దృశ్యం చూసి ప్రతి ఒక్కరికీ కంట కన్నీళ్లు ఆగడం లేదు. తల్లి మృతదేహం దగ్గర ముగ్గురు పిల్లలు నిలబడి అమ్మ... లే అంటూ ఏడుస్తూ ఉంటే అందరి మనసులు చెలించి పోయాయి. చిన్న వయసులో తల్లిదండ్రులను కోల్పోయిన ఆ ముగ్గురు పిల్లల చదువులు, ఉపాధి కొరకు ప్రభుత్వం సహాయం చేస్తే బాగుంటుందని గ్రామస్తులు కోరుతున్నారు. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి అనాథలైన చిన్నారులను ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మృతురాలు మౌనికకు తెలుగుదేశం సభ్యత్వం ఉంది. అయితే టిడిపి కేంద్ర కార్యాలయానికి సమాచారం ఇస్తే వారు సాధారణ మరణానికి ఇన్సూరెన్స్ పథకం వర్తించదని చెప్పినట్లు తెలిసింది. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఆంధ్రప్రదేశ్ మరి టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య దృష్టికి తెలుగుదేశం మండల పెద్దలతో కలిసి తీసుకువెళ్తామని తెలుగుదేశం ఎస్సీ సెల్ అధ్యక్షులు గురిజాల పోలయ్య, ప్రకాశం జిల్లా ఫోరం అధ్యక్షులు గురిజాల బాబురావు, తెలుగు యువత ఎస్సి విభాగం నాయకులు గురిజాల రాజు, గురిజాల సురేష్, గురిజాల ప్రసాద్ మరి కొంతమంది గ్రామ పెద్దలు తెలిపారు. శోక సముద్రంలో మునిగిపోయిన ఆ కుటుంబాన్ని ఓదార్చి మనోధైర్యాన్ని ఇచ్చారు.



తల్లి మృతదేహం వద్ద దీనంగా చిన్నారులు

గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలి

మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపిపి కట్టా శోభారాణి



మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

గ్రామంలో త్రాగునీటి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని ఎంపిపి కట్ట శోభారాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో వేసవి కాలంలో ఎక్కడ మంచి నీటి సమస్య లేకుండా చూడాలని సూచించారు. అధికారులు గ్రామాల్లో ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుని పని చేయాలని చెప్పారు. పంచాయతీ రాజ్ ఎఇ కోట శ్రీహరి మాట్లాడుతూ పల్లె పండుగ ద్వారా గ్రామాలకి నిధులు వచ్చాయని అన్నారు. ఆ నిధులతో మొత్తం సిమెంట్ రోడ్లు, కాలవల నిర్మాణం చేపట్టామని అన్నారు. రూరల్, అర్బన్ ద్వారా రూ.వంద కోట్లతో మండలం లోని ఏడు గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో వచ్చిన ఈ పథకం మధ్యలో కొంత ఆగిపోయి మళ్లీ ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి సహకారంతో పనులు మొదలు పెట్టామని అన్నారు. ప్రస్తుతం పల్లె పండుగ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ డి జయమణి, తహశీల్దార్ టి రవి, వైస్ ఎంపిపి ఎస్క్ షకీల, కో ఆప్షన్ సభ్యులు ఎస్‌డి సర్దార్, డిప్యూటీ ఎండిఓ సిహెచ్ సుధాకర్, ఏఓ జివి కష్ణారావు, వెలుగు ఏపిఎం భాగ్యలక్ష్మి, డాక్టర్ కష్ణ చైతన్య, డాక్టర్ హాజరత్తయ్య, ట్రాన్స్కో ఎఇ సాంబశివరావు పాల్గొన్నారు.

ఎంపీటీసీలు సంతకం పెట్టి వెళ్లగా సర్పంచ్‌లు డుమ్మా

మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు వచ్చి హాజరై సంతకాలు పెట్టి వెళ్లారు. సర్పంచులు మాత్రం డుమ్మా కొట్టడం కనిపించింది. గ్రామాల్లో ఉన్న ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన ప్రజా ప్రతినిధులు మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సమావేశాలకి డూమ్మ కొట్టడం విమర్శలకు కారణమైంది. సమావేశానికి ఎంపీటీసీలు సైతం అధికారులు ఫోన్ చేసి పదే పదే అడగడంతో వచ్చారు. అక్కడికి వచ్చి సంతకాలు పెట్టి వెళ్ళిపోవటం విశేషం. ఒక్క ఎంపీటీసీ కూడా ప్రజా సమస్యల గురించి చర్చించిన దాఖలాలు కనిపించలేదు. ఇక 10 మంది సర్పంచులు ఉండగా ఒక్క సర్పంచ్ కూడా సమావేశానికి హాజరు కాకపోవటం విశేషం. ఇక మండల స్థాయి అధికారులు పూర్తిస్థాయిలో రాలేదు.



సమావేశానికి హాజరైన ప్రజా ప్రతి నిధులు, అధికారులు

సమాచార హక్కు చట్టంతో ఆక్రమాలకు చెక్



మాట్లాడుతున్న ఎంపిడిఒ దేవసేన కుమారి

ప్రజాశక్తి - టంగుటూరు

ఆంధ్రప్రదేశ్ సమాచారం కమిషనర్ చావలి సునీల్ ఆదేశాల ప్రకారం మండలంలోని అనంతవరం గ్రామంలో సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. సమాచార హక్కు చట్టంతో అక్రమాలకు చెక్ పెట్టవచ్చని ఎంపీడీఒ దేవసేన కుమార్ అన్నారు. సమాచార హక్కు చట్టంతో గ్రామాల్లో ప్రభుత్వ నిధులు ఏ విధంగా ఖర్చు చేస్తున్నారు? నిధులతో చేస్తున్న పనులు ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయనే కోణంలో సమాచార హక్కు చట్టంతో అధికారులను ప్రశ్నించవచ్చని తెలిపారు. అక్రమాలను వెలుగులోకి తీసుకువచ్చి, 2005 సమాచార హక్కు చట్టం దేశంలోని సామాన్య ప్రజలకు ఉపయోగకరం అన్నారు. రేషన్ కార్డుతో మండలాల్లో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో సమాచార హక్కు చట్టంతో ప్రశ్నించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అనంతవరం ఉప సర్పంచి కసుకుర్తి భాస్కరరావు, వెలగపూడి మాజీ సర్పంచ్ కె వెంకటేశ్వర్లు, ఎంఈఓ చెంచు పునయ, ఎపిఓ మాచర్ల, పంచాయతీ కార్యదర్శి మాలతి పాల్గొన్నారు.

ఒప్పంద కార్మికులు విముక్తి పొందాలి



మాట్లాడుతున్న తహశీల్దారు రవి

ప్రజాశక్తి-శింగరాయకొండ

తహసిల్దార్ ఆధ్వర్యంలో ప్రతినెల చివరి రోజున ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో పౌర హక్కులపై అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా బుధవారం పౌర హక్కుల దినోత్సవం పాత శింగరాయకొండ పంచాయతీ పరిధి, మల్లికార్జున్ నగర్ గిరిజన కాలనీలో నిర్వహించారు. తాహశీల్దార్ టీ రవి అధ్యక్షత వహించి గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆరాదీశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, గిరిజనులను ఎవరన్నా తక్కువగా చూసే సంఘటనలు, వారిపై దాడి చేయటం లాంటి అంశాలను వాకబు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలను వివరించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులు పొట్లూరి లక్ష్మయ్య మాట్లాడుతూ శింగరాయకొండ పరిధిలో గిరిజనులు ఎక్కువగా కర్రకోత పనులకి వెళ్తున్నట్టు తెలిపారు. యజమాని వద్ద నుండి గిరిజనులకు అందుతున్న న్యాయబద్ధమైన కూలి, పనిచేసే సమయం గురించి తెలిపారు. మండలంలో ఒప్పంద కూలీలుగా పనిచేస్తున్న గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు తమ దష్టికి తీసుకువస్తే కలెక్టర్ ద్వారా తగు న్యాయం చేయించగలరని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎండిఓ సిహెచ్ సుధాకర్, న్యాయవాది పంతగాని వెంకటేశ్వర్లు, హెచ్ఎం అర్రిబోయిన రాంబాబు, ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ నుండి సురేష్, స్థానిక నాయకులు ఝాన్సీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నాయకుడు కోయ సతీష్

ప్రధాని సభకు తరలి రావాలి

ప్రజాశక్తి - యద్దనపూడి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద టిడిపి మండల నాయకుల సమావేశం బుధవారం నిర్వహించారు. మే2న అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనుల ప్రారంభ సభకు ప్రధాని మోడీ వస్తున్న సభకు ప్రజలు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో కోయ సతీష్, సిహెచ్ కృష్ణ, పూనూరు మాజీ సర్పంచ్ సాంబయ్య, గన్నవరం ఎంపిటిసి జి సతీష్, వెంకటరావు, రంగయ్య చౌదరి, సుధీర్, అంకమ్మ చౌదరి, తారక, శ్రీనివాసరావు, వంశీ పాల్గొన్నారు.



కోటా శ్రీహరి దంపతులను సన్మానిస్తున్న అధికారులు

ఎఇ కోటా శ్రీహరికి సన్మానం

ప్రజాశక్తి - శింగరాయకొండ

పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ కోటా శ్రీహరి ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయనను ఘనంగా సన్మానం చేశారు. ఆయన సతీమణి సుజాతను అధికారులు సత్కరించారు. శింగరాయకొండ, జరుగుమల్లి ఎంపిపిలు కట్టా శోభారాణి, బెల్లం నిర్మల, ఎండిఓ డి జయమణి, పంచాయతీ రాజ్ ఇఇ కోటేశ్వరరావు, డిఇ జె రవిబాబు, రమణయ్య, ఎఎంసి మాజీ చైర్మన్ బెల్లం సత్యనారాయణ, సుదర్శి ప్రసాదరావు, శీలం సుబ్రహ్మణ్యం, మోటుపల్లి వెంకటేశ్వర్లు, చిడిపుడి కష్ణారెడ్డి, ముల్లపూడి సత్యనారాయణ, జివి కష్ణారావు, ఎం భాగ్యలక్ష్మి, షేక్ నాసిర్, ఆయన కుటుంబ సభ్యులతో పాటు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



పశువుల నీటి తొట్లను పరిశీలిస్తున్న జెడిఎ బేబీరాణి

దాహం తీర్చేందుకే నీటితొట్లు

ప్రజాశక్తి - మర్రిపూడి

వేసవిలో మేతకు వెళ్లే పశువుల దాహార్తి తీర్చడం కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్లను ఉపయోగించుకోవాలని పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె బేబీ రాణి కోరారు. మండలంలోని గుండ్లసముద్రం గ్రామంలో వేసవిలో పశు పోషణలో తీసుకోవలసిన జాగ్రత్తలపై పశు పోషకలకు అవగాహన కల్పించారు. ఈపాటికే పశు గ్రాసం, మినీ గోకులాలు, రాయితీపై పశుగ్రాస విత్తనాలు, పశు బీమా వంటి అమలు చేస్తున్నామని అన్నారు. తాజాగా పశువుల బీమా, ఉత్పత్తిని కాపాడడానికి 50శాతం రాయితీపై నాణ్యమైన సమీకృత దాణా ప్రభుత్వం సరఫరా చేస్తుందని అన్నారు. ప్రతి మండలానికి 6.5 మెట్రిక్ టన్నుల దాణా సరఫరా చేస్తామని అన్నారు. మర్రిపూడి పశువైద్యశాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ ఐ బ్రహ్మయ్య పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఇంకొల్లు నుంచి కొనికిపోయే పాత మాద్రాస్ రోడ్డు సమీపాన చెట్లలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు బుధవారం గుర్తించారు. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ జి సురేష్ పరిశీలించారు. ఇప్పటికీ మృతుడు ఎవరనేది, ఎలా చనిపోయాడనేది తెలియలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించే అందుకు ఏరియా వైద్యశాలకు తరలించారు.



శంకుస్థాపనలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

నగరంలోని పలు డివిజన్లలో అభివద్ధి కార్యక్రమాలను స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ బుధవారం ప్రారంభించారు. 9వ డివిజన్ పులి వెంకటరెడ్డి కాలనీ వద్ద రూ.2 కోట్లతో నిర్మించనున్న సిసి కాలువ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా 9వ డివిజన్ లోని ఇందిరమ్మ కాలనీ 6వ లైను వద్ద రూ. 2.70 కోట్లతో సీసీ రోడ్డు , సీసీ కాలువ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 16వ డివిజన్ బాలాజీ నగర్‌లో రూ. 46 లక్షలతో నిర్మించిన కాలువను ప్రారంభించారు. 24వ డివిజన్ లో రూ.40 లక్షలతో ఊరచెరువు అభివద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 35వ డివిజన్ సాయిబాబా దేవస్థానం వద్ద కొత్తగా రూ. 35 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ కె. వెంకటేశ్వరరావు, పలువురు అధికారులు, కార్పొరేటర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి- కొత్తపట్నం

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా తెలిపారు. కొత్తపట్నం మండలంలోని పలు ప్రాంతాల్లో కలెక్టర్ బుధవారం విస్తతంగా పర్యటించారు. తొలుత రంగాయపాలెం లోని కిష్టం వెంకటరావు డెయిరీ ఫాం సందర్శించారు. డెయిరీ ఫాం ఏర్పాటుకు ఎంత ఖర్చయింది, నిర్వహణకు నెలకు ఎంత ఖర్చవుతుంది, ఆదాయం ఎంత వస్తుందనే అనే విషయాలను కలెక్టర్ డెయిరీ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. డెయిరీ ఫాం ఏర్పాటుకు రూ.25 లక్షల రుణం తీసుకున్నామని, 32 ఆవులు ఉన్నాయని, వాటి ద్వారా రోజూ సుమారుగా 400 నుంచి 500 లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నట్లు డెయిరీ ఫాం నిర్వాహకులు కలెక్టర్‌కు వివరించారు. అన్నీ ఖర్చులు పోను నెలకు సుమారు రూ. లక్ష నుంచి ఒకటిన్నర లక్షల ఆదాయం వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా పాడి రైతులకు సబ్సిడీపై మేత విత్తనాలను, దాణా పంపిణీ చేశారు. అనంతరం డిడి కాలనీలో పి. వెంకటేశ్వర్లు అనే రైతు ప్రకతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేస్తున్న వేరుశనగ పంటను సందర్శించి రైతుతో మాట్లాడారు. వేరుశనగ పంటలో అంతర పంటలుగా పొద్దు తిరుగుడు, బెండకాయ, క్లస్టర్ బీన్ సాగు చేస్తున్నట్లు రైతు కలెక్టర్‌కు వివరించారు. ప్రకతి వ్యవసాయం ద్వారా ఎక్కువ ఆదాయం వస్తున్నట్లు రైతు తెలిపారు. అనంతరం మండల పరిధిలోనిగ ˆమళ్ళపాలెంలో ప్రకతి వ్యవసాయ విధానంలో భాగంగా పిఎండిఎస్ విధానంలో సాగు చేస్తున్న రైతు వి.వెంకటేశ్వరరెడ్డికి సంబంధించిన వ్యవసాయ క్షేత్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు బంజరు భూమిలో పిహెచ్, తేమ మరియు ఉష్ణోగ్రత నమోదుపై లైవ్ డెమో, అలాగే పిఎండిఎస్ క్షేత్రంలో మట్టి నమూనా సేకరణపై నిర్వహించిన డెమోనుకలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ హార్టీకల్చర్ క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా హార్టీకల్చర్ మొక్కల పెంపకం విధానాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులకు జీలుగా, జనుము, పిల్లిపిసర విత్తనాలను సబ్సిడీపై అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ హార్టీకల్చర్ ఫాంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లో ఒంగోలు ఆర్‌డిఒ లక్ష్మి ప్రసన్న, పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బేబి రాణి, వ్యవసాయ శాఖ ఇన్‌ఛార్జి జేడీ సుబ్రహ్మణ్యేశ్వర శర్మ, ప్రకతి వ్యవసాయ డిపిఎం సుభాషిణి, ఎపిఎంఐపి పీడీ రమణ, జిల్లా హార్టీకల్చర్ అధికారి గోపి చంద్, తహశీల్దారు మధుసూధన రావు, ఎంపిడిఒ శ్రీకష్ణ, ఎఒ మోహన్ రెడ్డి, విఎఎలు తదితరులు పాల్గొన్నారు.



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి

ప్రపంచ కార్మిక దినోత్సవం

మేడే

ప్రత్యేక అనుబంధం

బాపట్ల జిల్లా 16 పేజీలు గురువారం 1 మే 2025 Advt feature







కార్మిక వర్గంపై దాడులను ప్రతిఘటించడమే..

కార్మికవర్గం ముందున్న మేడే కర్తవ్యం..



ప్రపంచీకరణ - సరళీకరణ - ప్రైవేటీకరణ విధానాలు ప్రారంభమైన గత మూడు దశాబ్దాల్లో కార్మికవర్గంపై దాడులు తీవ్రతరమయ్యాయి. కార్మికులకు హక్కులు కల్పించే చట్టాలను ప్రభుత్వాలు రద్దు చేస్తూ పెట్టుబడిదారుల, పారిశ్రామికవేత్తల కొమ్ముగాస్తున్నాయి. ఆనాడు పని గంటలు తగ్గించాలని, 8 గంటల పని విధానం ఉండాలని చేసిన వీరోచితమైన పోరాటాలే మేడేగా మారాయి. ఈనాడు ఐటి రంగం సహా అనేక రంగాల్లో 12 నుండి 16 గంటలు పనిచేయడం, ఆరోగ్యాన్ని, కుటుంబ జీవితాన్ని ఉద్యోగులు, కార్మికులు కోల్పోవడం చూస్తున్నాం. అంతర్జాతీయంగా, జాతీయంగా కూడా కార్మిక, ఉద్యోగవర్గాలపైన, ప్రజల ఐక్యతపైనా దాడులు పెరుగుతున్న నేపథ్యంలో వాటిని ప్రతిఘటించడమే నేడు కార్మికవర్గం ముందున్న మేడే కర్తవ్యం.

అంతర్జాతీయంగా ప్రపంచీకరణ విధానాలు ప్రారంభమైన తొలిదశలో సామ్రాజ్య వాదం, పెట్టుబడిదారీ విధానమే అజేయమని, వాటికి ఎదురులేదని సిద్ధాంతీకరించారు. 2008లో వచ్చిన ప్రపంచ ఆర్థిక సంక్షోభం తర్వాత సామ్రాజ్యవాద ఆర్థికవ్యవస్థ డొల్ల తనం బయటపడింది. ఈ రోజు సామ్రాజ్యవాదులు అమెరికా నాయకత్వంలో ఉద్రిక్తతలను, యుద్ధాలను సృష్టిస్తున్నారు. తమ వ్యాపార, వాణిజ్య సామ్రాజ్యాలను వర్ధమాన దేశాల్లో విస్తరించడానికి రకరకాల ఎత్తుగడలు వేస్తున్నారు. రష్యా - ఉక్రెయిన్ యుద్ధం సామ్రాజ్యవాద ఎత్తుగడల్లో భాగమే. ఉక్రెయిన్‌ను 'నాటో' కూటమిలో చేర్చుకుని, నాటోను విస్తరించి తన ఆధిపత్యాన్ని చాటుకోవడానికి అమెరికా చేసిన ప్రయత్నమే ప్రస్తుత పరిస్థితికి కారణం. ఇటువంటి యుద్ధాలు, ఉద్రిక్తతలు సృష్టించడం ద్వారా అమెరికా తన ఆయుధాలను అమ్ముకోగలుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాద విధానాలకు, ప్రపంచీకరణ విధానాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమాలు, పోరాటాలు జరుగుతున్నాయి. లాటిన్ అమెరికాలోని అనేక దేశాల్లో వామపక్ష శక్తులు విజయం సాధిస్తున్నాయి. ఈ క్రమంలో ప్రపంచీకరణ విధానాలకు పెరుగుతున్న ప్రతిఘటన ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లాలి.

భారతదేశం - ప్రైవేటీకరణ, మతతత్వ విధానాలు

భారతదేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం సరళీ కరణ - ప్రైవేటీ కరణ - ప్రపంచీకరణ విధానాల అమ లును వేగవంతం చేయడంతోపాటు ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీయడానికి మతతత్వాన్ని బహిరంగంగా ప్రోత్సహిస్తోంది. ప్రైవేటీకరణలో భాగంగా 'మానిటైజేషన్' విధానాలు అమలు చేస్తామని దేశ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టంగా ప్రకటించారు. లాభాలతో నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలు సహా అన్నింటినీ ప్రైవేటీకరిస్తామని ప్రకటిం చారు. దీనిలో భాగమే 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' నినాదంతో పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మా గారాన్ని ప్రైవేటీకరించడం. దీనికి వ్యతిరేకంగా విశాఖ నగరంలో దీర్ఘకాలికంగా ఉద్యమం జరుగుతోంది. ఆంధ్ర ప్రదేశ్‌లోని మిగిలిన జిల్లాల ప్రజలు, కార్మికులు కూడా ఉక్కు కర్మాగారాన్ని రక్షించుకునే ఉద్యమంలో భాగస్వాములు కావాలి. దేశ ఆర్థిక వ్యవస్థకు కొండంత అండగా ఉన్న ఎల్‌ఐసి (జీవిత బీమా సంస్థ)ని ప్రైవేటీకరించడానికి ప్రయ త్నాలు ప్రారంభించింది. కార్మికుల హక్కులు కాలరాయడానికి నాలుగు లేబర్ కోడ్‌ల చట్టాలను రూపొందించింది. వీటన్నింటినీ నిలువరించాలంటే కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులు, ఉద్యోగులు ఐకమత్యంగా ప్రతిఘటించాలి.

నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలను మతపరంగా చీలదీసే ప్రయత్నాలు ప్రారంభించింది. పౌరసత్వ సవరణ చట్టం, జమ్ము-కాశ్మీర్‌కు స్వయంప్రతిపత్తిని కల్పించే 370 నిబంధనను రద్దు చేయడం, మైనార్టీలపై మతపరమైన దాడులు దీనిలో భాగమే. ఇప్పుడు దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో ముఖ్యంగా బిజెపి అధికారంలో ఉన్న కర్నాటక, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో మత పరమైన ప్రదర్శనలు నిర్వహిస్తూ, మైనార్టీలపై దాడులు చేస్తున్నారు. ప్రజల మధ్య మతపరమైన సామరస్యాన్ని దెబ్బతీయడం ద్వారా కార్మికోద్యమాన్ని, కార్మికవర్గ ఐక్యతను దెబ్బతీయడం కూడా పాలక వర్గాల లక్ష్యంగా ఉంటోంది. దేశంలో మత సామరస్యాన్ని, రాజ్యాంగ లక్ష్యాలను కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మికవర్గంపై ఉంది.

మోడీ ప్రభుత్వ ఆర్థిక, సామాజిక, విధానాలపై విస్తృతమైన ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉంది. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుని మోడీ ప్రభుత్వ విధానాలపై పోరాడాలి. ప్రతిఘటన ఉద్యమంలో విస్తృతమైన ప్రజానీకాన్ని భాగస్వాములను చేయాలి.

కర్తవ్యాలు

మేడే సందర్భంగా కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయ, పెన్షనర్లు అందరూ జరుగుతున్న పరిణామాలపై స్పందించి విశాల ఉద్యమాల్లో, ఐక్య పోరాటాల్లో పాల్గొనాల్సిన అవసరం ఉంది. కార్మికుల, ఉద్యోగుల హక్కులను హరించే చట్టాలకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమాల్లో పాల్గొనాలి. దేశ స్వావలంబనకు దోహదపడిన పెద్ద పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే విధానాలను ప్రతిఘటించాలి. మతతత్వాన్ని, మతోన్మాదాన్ని రెచ్చగొట్టి ప్రజలను, కార్మికులను చీల్చే విధంగా జరిగే ప్రయత్నాలను అర్థం చేసుకుని వాటిని వ్యతిరేకించాలి. కార్మిక, కర్షక, ఉద్యోగ వర్గాల ఐక్యత కోసం కృషి జరగాలి.

మేడే స్ఫూర్తితో లేబర్ కోడ్స్‌ను వ్యతిరేకిద్దాం..

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా



కార్మికుల హక్కులను హరించే చట్టాలకు వ్యతిరేకంగా పోరాటానికి యావత్తు కార్మిక వర్గం సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ కోరారు. ప్రపంచ కార్మికవర్గ చరిత్రను 1846 అమెరికాలోని చికాగోలో కార్మిక తిరుగుబాటు మలుపు తిప్పింది, చికాగో వీరులు స్పైస్, పార్సన్స్, ఏంజెల్, ఫిషర్, లింగులను ఉరితీసి ఉద్యమాన్ని అణిచివేయాలన్న కుట్ర వీగిపోయింది. ప్రపంచమంతా ఈ అగ్ని దావానలంలా వ్యాపించింది. యజమానులు తలొగ్గి రోజుకి 8 గంటలపై చట్టాలు చేశారు. 140 సంవత్సరాల తర్వాత నేడు ఎల్ అండ్ టి చైర్మన్ సుబ్రహ్మణ్యన్ రోజుకు 15 గంటలు పని చేయాలని ఆదివారం ఇంట్లో పెళ్ళాలతో కబుర్లు చెప్పుకోవాలా అని కార్మికులను వెటకారం చేస్తున్నారు. మరొకవైపు బ్రిటిష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న చట్టాలను మోడీ ప్రభుత్వం రద్దు చేసింది. వాటి స్థానంలో లేబర్ కోడ్లను కార్మికవర్గంపై రుద్దాలని బిజెపి ప్రభుత్వం ఆరాటపడుతుంది. ఈ లేబర్ కోడ్స్ అమల్లోకి వస్తే సంఘాలను పెట్టనివ్వరు. కార్మికుల సమ్మెలు చేస్తే జీతాల్లో కోత పెట్టి, ఎస్మా ప్రయోగించి నాయకులను జైలుకు పంపుతారు. ఉన్న హక్కులన్నీ పోతాయి. అందుకే ఎనిమిది గంటల పని విధానం నిలబెట్టుకోవడం నేడు ఒక సవాల్. లేబర్ కోడ్స్ అమలు కాకుండా అడ్డుకోవడం మరొక సవాల్. కార్మికుల హక్కులను హరించే చట్టాలకు వ్యతిరేకంగా పోరాటానికి యావత్తు కార్మిక వర్గం సిద్ధం కావాల్సి ఉంది. మనిషి మనిషిగా బతకాలి అంటే 8 గంటల పని, 8 గంటలు విశ్రాంతి 8 గంటల దినచర్య ఉండాలి. ఎనిమిది గంటల కంటే అదనంగా చేసిన పనిలో నాణ్యత ఉండదు. సుస్థిరమైన పనితీరు కనబరచాలంటే మానసిక ఆరోగ్యం విశ్రాంతి అవసరం ఇది సైన్స్. కానీ పెట్టుబడుదారులు అధిక లాభాలు గడించే ఆలోచనతో నిరుద్యోగాన్ని అవకాశంగా తీసుకొని అనేక రంగాలు ఇప్పటికే 12 గంటల పని దినాన్ని అమలు చేస్తున్నారు. ఐటీలో ఉద్యోగుల ఆరోగ్యం ఫణంగా పెట్టి పని చేస్తున్నారు. దేశంలో ఇప్పటికే సెక్యూరిటీ గార్డులు 12 గంటలు, 24 గంటలు డ్యూటీ చేస్తున్నారు. పెట్టుబడిదారులు ఎక్కడ ఆదాయాలు ఉంటే అక్కడ కార్మికుల వలసలను ప్రోత్సహిస్తున్నారు. వ్యవసాయ రంగం మన దేశంలో తీవ్ర సంక్షోభంలో ఉంది. గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు పోతున్నారు పట్టణాల్లో కార్మికులకు పోటీ పెరిగి బేరసారాలాడే శక్తి సన్నగిల్లుతుంది. వినిమయ అవసరాలు పెరుగుతున్నాయి. రెండు, మూడు రకాల పనులు చేస్తే గాని బతకలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనిని అవకాశంగా తీసుకొని కార్మికులను తక్కువ జీతాలు ఇచ్చి ఎక్కువ పని గంటలు చేయించుకోవాలన్న పద్ధతిని యజమానులు అవలంబిస్తున్నారు. శాస్త్ర సాంకేతిక పెరిగింది. తక్కువ పని చేసినా ఉత్పత్తి అనేక రెట్లు పెరిగింది. అందుకే అంతర్జాతీయ కార్మిక సంస్థ రోజుకు 7 గంటలు చొప్పున వారానికి 35 గంటలు మాత్రమే పని చేయాలని తీర్మానం చేసింది. కానీ పెట్టుబడుదారులు లాభాపేక్షతో దీన్ని ఎక్కడ అమలు చేయడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయి. లేబర్ కోడ్స్ పై యావత్ కార్మిక వర్గం యుద్ధం ప్రకటించింది. మే 20వ తేదీన దేశవ్యాప్తంగా సమ్మెకు సిద్ధమవుతుంది. యూనియన్ ఉన్న లేకున్నా లేబర్ కోడ్స్ అడ్డుకోకపోతే కార్మికుల భవిష్యత్తు అధికారం అవుతుంది. ఇప్పుడు ఉన్న కొద్దిపాటి భద్రత కూడా లేకుండా పోతుంది. కేంద్రం 29 చట్టాలు రద్దు చేసి నాలుగు కోడ్స్‌గా మారుస్తుంది. నేడు మోడీ ప్రభుత్వం కనీస వేతన కోడ్‌లో రోజుకి రూ.178గా నిర్ణయించింది.బిల్డింగ్ సలహా మండలి బోర్డు ఉత్తి బోర్డులుగా మారతాయి. పాలకులు కార్మిక హక్కులను కాలు రాస్తారు. లేబర్ కోడ్స్ అమ్మలోకి రాకుండానే పిఎఫ్, ఈఎస్ఐ ,బోనస్ ,జీతం ఏది చెల్లించకపోయినా యజమానులకు శిక్షలు లేవు. గతంలో ఫిర్యాదులకు అధికారులు ఎంతో కొంత తనిఖీలు ఉండేవి, నేడు వాటిని తొలగించారు. భద్రత లేకుండా ప్రాణాలు తీసిన కనీసం కేసులు కూడా పెట్టే పరిస్థితి ఉండదు. కార్మికులను కట్టు బానిసలుగా మారుస్తారు. హైర్ అండ్ ఫైర్ విధానాన్ని అమలు చేస్తారు. పర్మినెంట్ కార్మికులు లేకుండా ఫిక్స్ టర్మ్ కార్మికులుగా మారతారు. అందుకే కార్మిక హక్కుల సాధన కోసం కార్మిక చట్టాల రక్షణ కోసం మే 20 దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి. పై సమస్యల పరిష్కారం కేవలం సోషలిస్ట్ రాజ్యం లోనే అమలవుతుందని చరిత్ర రుజువు చేస్తుంది. 8 గంటల పని విధానం అమలు జరగాలన్నా, ఉత్పత్తి సాధనాలలో కార్మికులకు వాటాలు ఉండాలన్న కార్మిక వర్గ రాజ్యంలోనే సాధ్యమవుతుంది. దాని సాధన కోసం కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధం కావాలి. నేడు అమెరికా విధానాల ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభానికి దారి తీసే పరిస్థితుల్లో ఉన్నాయి. వీటికి వ్యతిరేకంగా మేడేస్ఫూర్తితో కార్మిక వర్గం పోరాటాలకు సన్నద్ధం కావాలని సిఐటియు పిలుపునిస్తుంది.

కష్టజీవుల స్వేదంపై ప్రసరించిన మేడే

కష్టజీవుల స్వేదంపై ప్రసరించిన
ఎర్రని సూర్యకిరణం మేడే..
ఎండిన జీవితం
చెమట చారికలతో మిగిలిన
దేహంతో
నిరాశా ఆకాశాన్ని నింపుకున్న
కార్మికలోకానికి మేడే వెలుగై
హక్కుల రెక్కలను అందించింది..
కార్మికుల స్వేదం మరిగి మరిగి
కరిగి కరిగి ఆకాశం నిండా ఎగిరి
సూర్యుడై వెలిగింది..
మేడే రోజై వికసించింది..
ఒళ్ళు హూనమై బతుకు భారమైన
శ్రమజీవుల కళ్ళల్లో మెరుపై ఎగిరింది
చెమట చుక్కలకు విలువను పెంచి
విశ్వమంతా ఎగిరింది..
ఐక్యంగా పోరుసల్పితే ఆకాశమే
హద్దని
కార్మికుల గుండె ధైర్యమైంది..
ఉద్యమాల మార్గాన్ని నేర్పింది..
మనిషిని మనిషి చేసే దోపిడీపై
నిరసన కేతనమై ఎగిసింది..
శ్రామికుడి చేతికి గొప్ప ఆయుధమై
నిలిచింది..
స్వార్థపు శక్తుల
దోపిడి నక్కల
ఆటలు ఇక సాగవని
అరుణ కంఠమై పోరెత్తింది..
ఎగిరింది ఎర్రజెండాగా
అవని నిండా.. ఆకాశమంతా
నీ శ్రమ ఫలితంలో కార్మికుడా!
తొలి ఫలం నీదేనంటూ నినదించింది
అవని అంతా అరుణ నినాదమై
హోరెత్తింది మేడే మేడే మేడే..
ప్రపంచ కార్మికులంతా ఒకటేనంటూ
ఐక్యతా కేతనమై ఎగిరింది
మానవత్వానికే మహోన్నత
సంకేతమైంది..
అవని అంతా రెపరెపలాడుతూ
ఎగురుతుంది అదిగో ఎర్రెర్రని మేడే
జెండా!
ఎప్పటికీ ఎగురుతూనే ఉంటుంది
మన జెండా!

\- వొరప్రసాద్

అరుణ పతాకకు జేజేలు

మేడే....ఓ మహత్తర పోరాటం పురుడుపోసుకున్న రోజు. ఎనిమిది గంటల పనిదినం కోసం కార్మికులు రక్తం చిందించిన రోజు. అంతేకాదు ఓ అరుణతారను శ్రామికులకు, కష్టజీవులకు అందించిన రోజు. 18వ శతాబ్దంలోనే యంత్రాలను ప్రవేశపెట్టడం ద్వారా పారిశ్రామికీకరణను ప్రారంభించిన పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు.. శ్రామిక ప్రజల శ్రమశక్తిని నిలువెల్లా దోచుకున్నారు. ఇందుకోసం శ్రామికులకు అమానుష శిక్షలు వేయడం.. చివరకు కొట్టి చంపడం వంటి క్రూరాతి క్రూరమైన చర్యలకు తెగబడ్డారు. ఈ నేపథ్యంలో 1886 మేలో అమెరికా దేశం చికాగో నగరంలోని హే మార్కెట్లో సమ్మె చేస్తున్న నలుగురు కార్మిక నేతలను పెట్టుబడి దారులు కాల్చి చంపారు. మే 4న మరో నలుగురు కార్మికులను కోర్టులో విచారించి 1887 నవంబర్ 11న నిర్ధాక్షిణ్యంగా ఉరివేసి చంపారు. దీంతో కార్మిక లోకం ఉవ్వెత్తున ఎగసింది. శ్రమజీవుల స్వేచ్ఛా సంకేతమైన అరుణ పతాకం రెపరెపలాడింది. అదే నేటికీ దోపిడీకి గురువుతున్న శ్రామికులకు, కార్మికులకూ వెలుగు దిక్సూచిగా ఉంది. అలాగే కార్మిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిన మే డే రోజునే (1913 మే 1న) దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, భారతదేశ కార్మికవర్గ పార్టీ అగ్రనేత, పేదల పెన్నిధి, మహోన్నత నేత పుచ్చలపల్లి సుందరయ్య జన్మించారు. ఆ మహానేత జయంతినీ శ్రామికులు, కార్మికులు...యావత్ ప్రజానీకం జరుపుకుంటూ స్ఫూర్తి పొందుతున్నారు.



ధరలు లేక..పెట్టుబడులు రాక

- పడిపోయిన అపరాల ధరలు
- నష్టాలు తప్పవని రైతుల ఆందోళన

ప్రజాశక్తి- భట్టిప్రోలు

ఖరీఫ్, రబీ సీజన్ సాగు చేసిన వరి,అపరాల పంటలకు గిట్టుబాటు ధరలు లేవు. దీంతో నష్టాలు తప్పవని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో సుమారు 15వేల ఎకరాలలో వరి సాగు చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే కురిసిన అధిక వర్షాలకు సుమారు 2000 ఎకరాలకు పైగా పంట నీట మునిగి దెబ్బతింది. మిగిలిన రైతులు అనేక వ్యయ ప్రయాసలకు ఓర్చి పంటను కాపాడుకున్నారు. ఎకరాకు 25 నుంచి 35 బస్తాల మేర దిగుబడి వచ్చింది. వరి కోతల సమయంలో వాతావరణ మార్పులు కారణంగా మేఘావృతమై అక్కడక్కడా చిరుజల్లులు పడ్డాయి. దీంతో వరికోతలు కోసిన రైతులు పంటను కాపాడుకునేందుకు హడావుడిగా కుప్పలు వేశారు. వరి పనలు ఎండకపోవడంతో గింజలు రంగు మారాయి. రంగు మారిన ధాన్యాన్ని నూర్పిడి చేస్తే వ్యాపారులు 75 కేజీల బస్తా ధాన్యం రూ.900 నుంచి రూ.1200 కు మించి కొనుగోలు చేయలేదు. రైతులు ఎకరాకు సుమారు 30 వేలకు పైగా ఖర్చు చేశారు. దీంతో రైతులకు ఎకరాకు దాదాపు రూ.10,000 నుంచి రూ.15, 000 వరకు నష్టం వచ్చే అవకాశం ఉందని రైతులువాపోతున్నారు. రబీ సీజన్‌లో అధిక వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాల్లో ముందుగా మినుము పంటలను సాగు చేశారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో రెండు, మూడు బస్తాలకు మించి దిగుబడి రాలేదు. పంట సాగుకు చేసిన ఖర్చు కూడా గిట్టుబాటు కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పెసర పంట ఎకరాకు మూడు నుంచి ఆరు బస్తాల మేర దిగుబడి వచ్చింది. మండల పరిధిలోని వెల్లటూరు, పెదపూడి, గొరిగపూడి, ఓలేరు, భట్టిప్రోలు గ్రామాల పరిధిలో సుమారు 5 వేల ఎకరాలలో రైతులు జొన్న, మొక్కజొన్న పంటలు సాగు చేశారు.

ఎకరాకు రూ.30 వేల నష్టం

గత ఏడాది ఇదే సీజన్‌లో వరి ధాన్యం 75 కేజీల బస్తా రూ.2 వేల నుంచి రూ. 2200 ధర పలికింది. ఈ ఏడాది ప్రస్తుతం ఏ గ్రేడ్ ధాన్యం 75 కేజీల బస్తా రూ.1,500 నుంచి రూ.1,600 లకు మించి కొనుగోలు చేయడం లేదు. మినుములు, పెసలకు గత ఏడాది క్వింటాకు రూ.9,000 రూ.10,000 వరకు ధర లభించింది. ఈ ఏడాది క్వింటా రూ.7,000 నుంచి కొనుగోలు చేయడం లేదని రైతులు చెబుతున్నారు. వరి ధాన్యం బస్తాకు రూ.500 చొప్పున లెక్క వేసినా ఎకరాకు 15 వేలకు పైగా నష్టం వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. అపరాలకు క్వింటాకు 3000 చొప్పున సరాసరి ఎకరాకు 4 క్వింటాళ్లకు కలిపి రూ.12,000 చొప్పున నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


వడ్లను తూర్పారబోస్తున్న కూలీలు

నామ మాత్రంగా కొనుగోలు కేంద్రాలు

పంట ఉత్పత్తులు ప్రారంభంలో ప్రభుత్వం హడావుడిగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. రైతులకు పంట చేతికి అందే ఫిబ్రవరి, మార్చి నెలలో ఎక్కడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీంతో వరికుప్పలను నూర్పిడి చేసి అయినకాడికి దళారులకు అమ్ముకోక తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిసెంబర్, జనవరిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలతో తమకు ఏమాత్రం ప్రయోజనం లేదని రైతులు చెబుతున్నారు. ఆ సమయంలో 10 శాతానికి మించి కూడా కొనుగోలు జరగలేదని తెలిపారు. ప్రస్తుతం పంటను నూర్పిడి సమయంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులందరికీ ప్రయోజనకరంగా ఉంటుందని చెబుతున్నారు.

రైల్వే స్టేషన్‌లో అన్నీ సమస్యలే..

- తాగునీరు, మరుగుదొడ్లు లేక అవస్థలు
- సైకిల్ స్టాండ్‌లోని వాహనాల చోరీ
- పట్టించుకోని అధికారులు
- ప్రయాణికులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి- భట్టిప్రోలు

ఒకప్పుడు ప్రయాణికుల రాకపోకలతో కళకళలాడే భట్టిప్రోలు రైల్వే స్టేషన్‌లో నేడు సమస్యలు తిష్ట వేశాయి. కరోనా సమయం నుంచి రైల్వేస్టేషన్‌లో కనీస సౌకర్యాలు అందుబాటులో లేవు. దీంతో రాకపోకలు సాగించే ప్రయాణికులు అవస్థలకు గురవుతున్నారు. కరోనా విపత్తుకు ముందే టికెట్లు ఇచ్చే విధానాన్ని ప్రైవేట్ పరం చేశారు. అప్పటి నుంచి రైల్వే స్టేషన్‌లో కనీసం తాగునీరు, మరుగుదొడ్ల వసతి లేదు. ప్లాట్ ఫామ్ పై ఉన్న చెత్తాచెదారాన్ని ఊడ్చేవారు కూడా లేకపోవడం గమనార్హం. స్టేషన్‌లో కనీసం టీ స్టాల్, టిఫిన్ కూడా లేదు. కరోనాకు ఈ స్టేషన్‌లో తాగునీటి వసతి, ప్లాట్ ఫాం శుభ్రత లాంటి సౌకర్యాలు ఉండేవి. ఆ సమయంలో ప్రయాణికులు నిత్యం తెనాలి, విజయవాడ, గుంటూరు ప్రాంతాలకు వెళ్లి వచ్చేవారు. రేపల్లె నుంచి తెనాలి వరకు మార్గమధ్యంలో ఉన్న భట్టిప్రోలు స్టేషన్ నుంచే రైల్వేకి ప్రయాణికుల ద్వారా అధిక ఆదాయం లభించేది. నిత్యం వ్యాపారస్తులు, దినసరి కూలీలు, బేల్దారి మేస్త్రీలు సుమారు రెండువేల మందికి పైగా ఈ స్టేషన్ నుంచే ప్రయాణిస్తుంటారు. .

సైకిల్ స్టాండ్ లేకపోవడంతో వాహనాల చోరీ

గతంలో రైల్వే స్టేషన్ అనుబంధంగా సైకిల్ స్టాండ్ ఉండేంది. కరోనా సమయం నుంచి దాన్ని తొలగించారు. తిరిగి ప్రారంభించేందుకు అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకుంటున్న దాఖలాలు లేవు. గతంలో సైకిల్ స్టాండ్‌ను రైల్వే శాఖ వేలంపాట నిర్వహించి కాంట్రాక్టుకు అప్పగించేంది. కాంట్రాక్టర్లు ప్రయాణికుల వాహనాలను స్టాండ్‌లోనే పెట్టుకొని రుసుము వసూలు చేసుకునేవారు. సైకిల్ స్టాండ్ ఉన్నప్పటికీ అది నిరుపయోగం మారింది. వాహనాలను భద్రపరిచేవారు లేదు.దీంతో నిత్యం ద్విచక్ర వాహనాలు చోరీలకు గురవుతున్నాయి. దూర ప్రాంతాలకు వెళ్లివచ్చే ప్రయాణికులు ఉదయాన్నే తమ వాహనాలను స్టేషన్ పరిసరా ప్రాంతాల్లో పార్కికింగ్ చేసుకుంటున్నారు. పనులు ముగించుకొని సాయంత్రం వచ్చి వాహనాలను తీసుకొని వెళ్తుంటారు. కొందరైతే రాత్రి సమయంలో కూడా రావడానికి వీలు కుదరక మరుసటి రోజు వచ్చేసరికి ఆ వాహనాలు చోరీకి గురవుతున్నాయి. ఇలా ఇప్పటి వరకూ సుమారు 100 ద్విచక్ర వాహనాలకు పైగా చోరీకి గురైనట్లు వాహన చోదకులు చెబుతున్నారు. బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కొన్ని వాహనాలను రికవరీ చేసి అప్పగిస్తున్నారు. అధిక శాతం చోరీకి గురైన వాహనాలు ఎక్కడున్నాయో కూడా తెలియడం లేదు. వాటిని కనుగొనడం పోలీసులకు సవాల్‌గా మారుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సైకిల్ స్టాండ్‌ను వినియోగంలోకి తెచ్చి తమ వాహనాలకు రక్షణ కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు. రైల్వే స్టేషన్‌లో తాగునీరు, మరుగుదొడ్ల వసతి కల్పించాలని కోరుతున్నారు.



భట్టిప్రోలు రైల్వే స్టేషన్


రక్షణ లేని రైల్వే సైకిల్ స్టాండ్














మేడే శుభాకాంక్షలతో..
M/S. మద్దుల కృష్ణమూర్తి
డీలర్స్ : భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్
డోర్ నెం : 11-16-154, రేపల్లె, ఫోన్ : 08648 - 222731
Bharat Petroleum
మా పెట్రోలు బంకు నందు పనిచేయుటకు సిబ్బంది కావలెను
ప్రొ॥ ఎం.భద్రయ్య గుప్త సెల్ : 9849856163


శివ డ్రైఫ్రూట్స్ వారి.....
Tasty Food
వాసవి ఫుడ్ కోర్ట్
వెజ్ స్నాక్స్ వరల్డ్
Crispy Veg Triangles
సోనోవిజన్ వెనుక, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌రోడ్, రేపల్లె
సెల్ : 92480 34435
| బిర్యాని | తందూరి | చైనీస్ | ఇండియన్
| ఐస్‌క్రీమ్స్ | జ్యూస్ | మిల్క్‌షేక్స్


కార్మికులందరికీ అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు....
LABOR DAY INTERNATIONAL
इंडियनऑयल
IndianOil
ముమ్మలనేని చంద్రశేఖర్ (బుజ్జి బాబు)
మహాలక్ష్మి ఆయిల్ కంపెనీ
ఇండియన్ ఆయిల్ డీలర్,
రేపల్లె, బాపట్ల జిల్లా
సెల్ : 98481 20981


మేడే శుభాకాంక్షలు
పర్చూరు మండలంలో ఉన్న
కార్మిక సోదరులకు రైతు సోదరులకు
వ్యవసాయ కార్మికులకు,
అనుబంధ వృత్తుల వారికి
ప్రపంచ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు...
MYS నాగలీలా వైన్స్ పర్చూరు
SS వైన్స్ పర్చూరు
లింగంశెట్టి వైన్స్ పర్చూరు
శ్రీ వెంకటేశ్వర వైన్స్ చెరుకూరు


శ్రమజీవుల పర్వదినం మే డే శుభాకాంక్షలు
ప్రపంచ కార్మిక దినోత్సవం
మేడే సందర్భంగా
శ్రామిక జనావళికి
హృదయపూర్వక
శుభాకాంక్షలు
ఎం.ఎం.కొండయ్య అభిమాని
చీరాల, బాపట్ల జిల్లా


మేడే శుభాకాంక్షలు
సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం
కొల్లూరు, బాపట్ల జిల్లా
ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా కార్మికులకు
అందరికీ మేడే శుభాకాంక్షలు.
ఐ. కోటేశ్వరరావు
సబ్ రిజిస్ట్రార్
మరియు సిబ్బంది


కార్మిక, కర్షక సోదరులకు మేడే శుభాకాంక్షలు
ది. రేపల్లె తాలూకా రైస్ మిల్లర్స్
అసోసియేషన్ - రేపల్లె
బాపట్ల జిల్లా
MAY DAY
శీమకుర్తి వీరాంజనేయులు,
ట్రెజరర్
మాజేటి మల్లికార్జునప్రసాద్
పద్మాలయ రైస్ మిల్ ప్రొప్రైటర్ మరియు
అధ్యక్షులు : తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్
మోహిత్ వెంకటసాయికృష్ణ
సెక్రటరీ
తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్

పోరాటాల ఫలితమే మేడే

ప్రజాశక్తి-రేపల్లె

శ్రామిక ప్రజల అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే.. ప్రపంచ వ్యాపితంగా శ్రామిక ప్రజలు తమ హక్కుల కోసం పోరాటాలను ఉధృతం చేస్తూ, మొత్తంగా ఈ పెట్టుబడిదారీ వ్యవస్థనే అంతం చేసి శ్రమదోపిడీ నుంచి శాశ్వతంగా విముక్తి కావాలన్న తమ అంతిమ లక్ష్యాన్ని పునరుద్ఘాటించే రోజు ఈ మేడే..' ప్రపంచ కార్మికులారా ఏకంకండి" అని ప్రపంచ వ్యాప్తంగా మే-1న నినదిస్తారు. ఆ పిలుపునకు అనుగుణంగానే దేశ, విదేశాల్లో కార్మికవర్గ పోరాటాలు నేటికీ జరుగుతూనే ఉన్నాయి. నేడు ప్రపంచీకరణ పేరుతో సామ్రాజ్యవాదం తన దోపిడీని తీవ్రతరం చేసింది. కార్మిక హక్కులపై ఉక్కు పాదాన్ని మోపుతున్న నేటి తరుణంలో కార్మికవర్గం మేడే ఆవిర్భావం ద్వారా వచ్చినా హక్కులు తెలుసుకోవలసిన అవసరం ఎంతో ఉంది. 18 శతాబ్దంలో ఉత్పత్తి పరిశ్రమల్లో యంత్రాలు రావటం ద్వారా ప్రపంచ దేశాల్లో కార్మికులు యంత్రాలతో పోటీపడుతూ రోజుకు 18 గంటలపాటు పనిచేయవలసినపుడు 1886 మే ఒకటో తేదీన అమెరికా చికాగోలో 25 వేల మంది కార్మికుల ప్రదర్శనతో 8గంటల పనివిధానం కోసం నినదించారు. దానికి కొనసాగింపుగా మే 3వ తేదీన కార్మికుల శాంతి ప్రదర్శనపై పోలీసులు కాల్పులు జరపడంతో ఆరుగురు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఆ మరుసటి రోజు హే మార్కెట్ ప్రాంతంలో కార్మికవర్గం శాంతియుత ప్రదర్శన మీద పోలీస్ కాల్పులు జరపడంతో కార్మికుల రక్తంతో హే మార్కెట్ ప్రాంతం తడిచిపోయింది. అనంతరం వీరోచిత పోరాటాలు ద్వారా ప్రపంచ దేశాల్లో కార్మికవర్గం 8 గంటల పని విధానాన్ని సాధించుకున్నారు. "ఇంతటి మహత్తర ఉద్యమానికి నాంది అయిన మే 1 అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా గుర్తింపు పొందింది"

రేపల్లె ప్రాంతంలో మేడే స్ఫూర్తితో వ్యవసాయ కూలీలు, కార్మికవర్గం సమస్యలపై అనేక పోరాటాల చరిత్ర కలిగిన ప్రాంతం పాత రేపల్లె తాలూకా, ఎర్రజెండా చేతబట్టి మోటూరి హనుమంతరావు, కొరటాల సత్యనారాయణ తదితర మహోన్నతులు తమ వ్యక్తిగత జీవితాలను త్యాగం చేసి స్వతహాగా వారు రైతాంగ, అగ్రవర్ణ కుటుంబాల వాళ్ళు అయినప్పటికీ నమ్మిన సిద్ధాతం కోసం ఈ ప్రాంతంలో శ్రమదోపిడీకి, వెట్టిచాకిరీకి గురైన వ్యవసాయ కూలీలు, కార్మికుల తరఫున నిలబడ్డారు.

వామపక్ష చైతన్యవంతమైన రేపల్లె ప్రాంతంలో అనేక కూలీ పోరాటాలు.. అనుభవాలు... మేడే స్ఫూర్తితో 8గంటల పని మా హక్కు మా శ్రమ దోపిడీ చేస్తున్నారని 1886లో అమెరికా చికాగోలో ప్రాణత్యాగాల ద్వారా సాధించుకున్న మేడే 8 గంటలు పని హక్కు అనుభవాలాని పాత రేపల్లె తాలూకా గ్రామాల్లో కూలీలతో మీరు దోపిడీ గురవుతున్నారు, మీకు అండగా మేము ఉన్నామని గడిచిన 25 సంవత్సరాల కాలంలో వామపక్ష రైతుకూలి, వ్యవసాయ కార్మిక సంఘాలకు నేతృత్వం వహించి వందల సమావేశాలు జరిపి కూలీలు, కార్మికులను చైతన్యం చేశారు. దానిలో వ్యవసాయ కార్మిక సంఘం, రైస్ మిల్ ముఠా వర్కర్స్ యూనియన్ నాయకుడు కీలకమైన పాత్ర పోషించాడు. ఎర్రజెండా స్ఫూర్తితో కొరటాల, ముత్తిరెడ్డి శ్రీరాములు లాంటి వాళ్ళు చివరి శ్వాస విడిచే వరకు రేపల్లె మండలంలో కూలి పోరాటాలను నడిపారు. అదేవిధంగా 1992-95 కాలంలో పాత రేపల్లె నియోజకవర్గంలో భాగమైన కిష్కిందపాలెం గ్రామంలో కూలిరేట్లు పెంచాలని పోరాటం నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం మహిళా నేత డి రమాదేవిపై లంక గ్రామాల్లో అగ్రవర్ణ కుటుం బాల వారు దాడికి పాల్పడ్డారు. రేపల్లె పట్టణంలో ఇంటి పనిచేసే కార్మికులను దోపిడీ చేస్తున్నారని, కూబూ పెంచాలని పనులు ఆపివేసి డి రమాదేవి నాయకత్వంలో సమ్మె నిర్వహిస్తే రేపల్లె పక్కనే ఉన్న పల్లెకోన గ్రామం నుంచి పోటీ కార్మికుల ను తీసుకువచ్చినా గట్టిగా ఎదుర్కొని కొంత కూలి పెంచుకోవటంతో పాటు గౌరవం పొందగలిగారు.

ఎన్నో పోరాటాలతో, ప్రాణ త్యాగాలతో మేడే ద్వారా కార్మికవర్గం 8గంటల పని, శ్రమకు తగిన కూలి, రాజ్యాంగంలో కార్మికులకు అనేక హక్కులు ఉన్నా ప్రభుత్వ యంత్రాంగం, కార్మికశాఖ అధికారులు యాజమాన్యం ఇచ్చే లంచాలకు అలవాటుపడి చోద్యం చూస్తున్నారు. రేపల్లె నియోజకవర్గంలో పెద్దసంఖ్యలో మహిళా కార్మికులు రోజువారీ కూలీలుగా రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలో పనికి వెళుతుంటే అత్యంత తక్కువ ఉష్ణోగ్రతలు ఉండే చోట గంటల తరబడి నిలబడి పనిచేస్తుంటే రొయ్యల కాటాలో మోసం చేస్తూ ఎక్కువ కేజీలు పని చేయించి తక్కువ కేజీలకు లెక్కకట్టి అత్యంత తక్కువ కూలి రూ.200 నుంచి రూ.300 ఇస్తూ మోసం చేస్తున్నారు. కొన్ని సార్లు ప్రమాదాలు జరుగుతున్నాయి బయటికి రానీయకుండా బెదిరింపులు చేస్తారు. 4 నెలల క్రితం నిజాంపట్నం రొయ్యల ప్రాసెస్ కంపెనీలో కెమికల్ లీకేజీ 110 మంది ప్రమాదం బారిన పడ్డారు. అయినా ఎటువంటి చర్యలూ తీసుకోని అధికారులు, ప్రభుత్వ, కార్మిక శాఖ అధికారులు కూలీలకు ఉన్న కనీస వేతనం చట్టం, ఐడి కార్డ్స్, ఇఎస్ఐ, పీఎఫ్ లాంటి చట్టాలు ఉన్నప్పటికీ వాటిని సక్రమంగా అమలు చేయకపోవటంతో నేటికీ శ్రమ దోపిడీకి గురవుతున్నారు. మేడే స్ఫూర్తితో అయినా కార్మిక శాఖ, ఇతర ప్రభుత్వ అధికారులు కార్మికుల హక్కులు కాపాడాలని అనేకమంది కార్మికులు కోరుకొంటున్నారు.



- వ్యాసకర్త సిహెచ్ మణిలాల్, సిఐటియు బాపట్ల జిల్లా అధ్యక్షులు


రిక్షా తొక్కుతున్న కార్మికుడు..

రక్తంతో నడుపుతాను రిక్షాను..

- ఉపాధి కోల్పోయిన రిక్షా కార్మికులు - ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి-బాపట్ల

సామాన్య ప్రజలకు ఒకప్పటి ప్రయాణ సాధనాలైన మూడు చక్రాల రిక్షా కార్మికుల ఉపాధికి ఆటోలు గండి కొట్టాయి. ఆటోల రంగ ప్రవేశంతో రిక్షా కార్మికులు ఉపాధి కోల్పోయి అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రయాణంలో వేగం పెరగడంతో ప్రజలు అధిక శాతం ప్రయాణానికి ఆటోలనే ఆశ్రయిస్తున్నారు. 1980, 90 దశకాల్లో గూడు రిక్షాలు, చెక్క రిక్షాల్లోనే స్థానికంగా కొద్దిపాటి దూరానికి ప్రజల ప్రయాణాలు కొనసాగించేవారు. కొద్దిపాటి దూరం ప్రయాణానికి సైతం రిక్షాలకు మంచి డిమాండ్ ఉండేది. అనంతర కాలంలో ఆటోలు రోడ్డు ఎక్కడంతో రిక్షాలకు బాడుగలు లేక రిక్షా కార్మికుల జీవన స్థితిగతులు దయనీయంగా మారాయి. మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రిక్షా కార్మికులు తీవ్రమైన శ్రమతో అంతంతమాత్రం రాబడితో కుటుంబ పోషణ భారమై జీవన పోరాటం చేస్తున్నారు. ఎండనక వాననక రోజంతా రిక్షా తొక్కడం ద్వారా కనీసం కుటుంబ పోషణకు సైతం రాబడి రాకపోవడంతో రిక్షా కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. సొంత రిక్షాలు కొనుక్కునే స్తోమత లేక అద్దె రిక్షాలపై ఆధారపడి ఉదయం నుంచి రాత్రి వరకు కష్టపడి సంపాదించిన సంపాదనలో రిక్షా అద్దె చెల్లించి మిగిలిన దానితో కాలం గడుపుతున్న రిక్షా కార్మికులు ఎందరో ఉన్నారు. చాలీచాలని ఆదాయంతో ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. రిక్షా బాడుగలనే నమ్ముకుని జీవిస్తున్న ఎందరో వృద్ధాప్యంలో రిక్షా తొక్క లేక, ఇతర పనులకు వెళ్లలేక దుర్భర దారిద్ర్యం మధ్య కాలం గడుపుతున్నారు. రిక్షాల ఒరవడి సాగినకాలంలో ఏర్పాటైన యూనియన్లు నేడు రిక్షాలకు ప్రాధాన్యత తగ్గడంతో యూనియన్లు కనుమరుగైపోయాయి. దీంతో రిక్షా కార్మికులను పట్టించుకునే నాథుడే లేడు. కార్మిక శాఖ సైతం వీరిని ప్రత్యేకంగా గుర్తించడం లేదు. కార్మిక శాఖ ద్వారా ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు వయసు పైబడిన రిక్షా కార్మికులకు వర్తించడం లేదు.రిక్షా కార్మికులు రోజంతా శ్రమించినా చాలీచాలని ఆదాయంతో అతి కష్టంపై జీవనం సాగిస్తున్నారు. రిక్షా తొక్కడం అనేది చాలా కఠినమైన కష్టతరమైన పని. మంచి వయస్సులో రిక్షానే నమ్ముకుని జీవనం సాగించిన ఎందరో వృద్ధాప్యంలో రిక్షా తొక్కలేక వేరే పనికి వెళ్లలేక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మధుమేహం, రక్తపోటు ఇతర అనారోగ్య సమస్యలతో అనేక మంది రిక్షా కార్మికులు మంచానికే పరిమితమయ్యారు. కార్మిక శాఖ బాల కార్మికులతో పనిచేస్తున్న వారిపై చర్యలకే పరిమితం కాకుండా వృద్ధాప్యంలో ఉన్న రిక్షా కార్మికులను గుర్తించి వారికి ప్రభుత్వం నుంచి సహాయం అందించేలా చూడాలని వారు కోరుతున్నారు.

అలుపెరుగని పోరాట యోధుడు 'మోటూరు'

ప్రజాశక్తి-బాపట్ల

ఆయన అక్షరం ఓ అఖండ దీపం.. విప్లవ పథాన అదొక అరుణ కిరణం.. ప్రజాశక్తి ద్వారా స్ఫూర్తిదాయక ఆశయం.. ఆయన జీవితం మరెందరికో మార్గదర్శకం.. నమ్మిన సిద్ధాంతం కోసం ఆశయం కోసం చివరి శ్వాస వరకు పోరాటం చేసిన అలుపెరగని కమ్యూనిస్టు యోధుడు మోటూరు హనుమంతరావు.. మేడే పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రజాశక్తి అందిస్తున్న ప్రత్యేక కథనం.

కమ్యూనిస్టు పార్టీలో ఆయన చేయని ఉద్యమం అంటూ ఏదీ లేదు.. ఆయనకు తెలియని కమ్యూనిస్టు యోధుడు లేడు. ఎన్నోసార్లు జైలు శిక్ష అనుభవించారు. ప్రజల పక్షాన పోరాటం చేయటంలో మాత్రం తొలి నుంచి చివరి వరకు ఆయన ఆశయంలో మాత్రం ఎక్కడ రాజీ పడకుండా ముందుకు సాగారు. విప్లవపథంలో తన పయనాన్ని సుధీర్ఘకాలం పాటు కొనసాగించారు. ప్రజాశక్తి స్థాపనలో మోటూరుది కీలకపాత్ర. ప్రజలకు ఒక బలమైన శక్తిగా ప్రజాశక్తిని రూపొందించారు. కొన్ని దశాబ్దాల పాటు అక్షర ఆయుధాన్ని కొనసాగించారు. ప్రజా సమస్యలను అన్ని కోణాల్లో ఎత్తిచూపి ప్రభుత్వ విధానాలను తూర్పార పట్టారు. 1917లో ఉమ్మడి గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా వెల్లటూరులో రైతు కుటుంబంలో పుట్టిన మోటూరు హనుమంతరావు ఒక ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపారు. ఎంహెచ్‌గా ఆయన సుపరిచితులు. పాఠశాల దశలోనే స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని అందిపుచ్చుకున్నారు. 1930 నుంచే రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనడం ప్రారంభించారు. విద్యార్థి ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. 1943లోనే గుంటూరు జిల్లా కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి అయ్యారు. రాష్ట్రంలోనూ, దేశంలోనూ కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రత్యేక స్థానం ఆక్రమించిన ఆ ఉద్యమ నిర్మాణంలో కీలక పాత్రధారి అయ్యారు. కొరటాల సత్యనారాయణతో సహా ఎందరికో పార్టీ సభ్యత్వం ఇచ్చారు. కళా సాహిత్యాల పట్ల ప్రత్యేకాసక్తి గల ఎంహెచ్ ప్రజానాట్యమండలికి మార్గదర్శకుడుగా ప్రజా కళా సృజనకు దోహదపడ్డారు. శ్రీశ్రీ మొదలుకొని నిన్నమొన్నటి యువ రచయితల వరకూ ఎందరితోనో ఆయనకు అనుబంధముంది.

సాహిత్యోద్యమంపై మార్క్సిస్టు అవగాహన పేరుతో ఆయన రాసిన పుస్తకం చాలా విలువైంది. 1948లో అవిభక్త కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడుగా ఎన్నికైన ఎంహెచ్ అనేక కీలకమైన తీర్మానాలూ, నివేదికలూ, పత్రాల రూపకల్పనలో ముఖ్య పాత్ర వహించారు. నిర్బంధాల, నిషేధాల మధ్య రహస్యంగా పనిచేస్తూ వీర తెలంగాణ సాయుధ పోరాటానికి సహాయమందించారు. అప్పటి ప్రజాశక్తి పత్రిక ప్రభుత్వ దాడిలో ధ్వంసమైన తర్వాత 'జనత' పత్రిక తీసుకు రావడానికి తొలి సన్నాహాలు చేశారు. ఇంతలోనే 1949 మేలో అరెస్టయ్యారు. 1952లో విడుదలైన వెంటనే రేపల్లె నియోజకవర్గం నుంచి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనసభకు పోటీ చేసి రాష్ట్ర మంత్రి కల్లూరి చంద్రమౌళిపై విజయం సాధించారు. ప్రస్తుత బాపట్ల జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమానికి ఊపిరి పోసిన ఎందరో అగ్రనేతల్లో మోటూరు అగ్ర భాగాన నిలిచారు.



మోటూరు హనుమంతరావు

సాయానికి ముందుంటారు..

పేదల సేవలో నల్లూరిపాలెం చారిటబుల్ ట్రస్ట్

ప్రజాశక్తి-రేపల్లె

మాట్లాడే పెదవుల కన్నా.. సాయం చేసే చేతులే మిన్న' సూక్తిని ఆదర్శంగా తీసుకున్నారు. త్రికరణశుద్ధిగా ఆచరిస్తున్నారు. ఉన్న దాంట్లో కొంత పేదలకు పంచుతున్నారు. అనారోగ్య బాధితులకు ఆసరా అందిస్తున్నారు. సేవా కార్యక్రమాలతో పేదల హృదయాల్లో నిలిచిపోతున్నారు. నలుగురికీ స్ఫూర్తినిస్తున్నారు. నల్లూరిపాలెం గ్రామంలో 2009 జనవరిలో ప్రభుత్వ, ప్రైవేటు, వ్యాపార, వ్యవసాయం తదితర వృత్తులపై ఆధారపడిన ఇరవై మంది సభ్యులతో కలసి 'ఉషోదయ సంఘంగా ఏర్పాటు చేసుకున్నారు. ట్రస్ట్ అధ్యక్షునిగా వీరవల్లి శివరామకృష్ణను ఎన్నుకున్నారు. నాటి నుంచి ట్రస్ట్ సభ్యులు ప్రతి నెలా కొంత ధనం వెచ్చించి సేవా కార్యక్రమాలపై దృష్టి సారించారు. ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై మరికొందరు సేవా దృక్పథంతో ట్రస్ట్ సభ్యులుగా చేరటంతో ప్రస్తుతం 100 మంది సభ్యులతో నడుస్తోంది.



శివరామకృష్ణ

జిల్లాలో మారుమూల ప్రాంతమైన రేపల్లె మండలం సముద్ర తీరంలో ఉంది. అలాంటి ప్రాంతంలో సేవా కార్యక్రమాలు చేయటంలో ముందు వరుసలో నిలుస్తోంది. నల్లూరిపాలెం గ్రామంలో గ్రామ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు కొంతమంది 2009లో ఉషోదయ సంఘం ఏర్పాటు చేసి వీరవల్లి శివరామకృష్ణ అధ్యక్షుడిగా ఈ సంస్థ ఈ ఏర్పాటైంది.

14 సంవత్సరాలుగా..

గత 14 సంవత్సరాలుగా నల్లూరిపాలెం గ్రామంలో వస్తు, ధనం, ఫర్నిచర్, దుస్తులు, విద్య , వైద్య, పరికరాలను వివిధ తరగతుల ప్రజలకు అందచేయటం ద్వారా ఈ సంస్థ నల్లూరిపాలెం ప్రజలకు చేరువ అయ్యింది. సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుభాగంలో ఈ సంస్థ నిర్వాహకులు ఉంటున్నారు. నల్లూరిపాలెం చారిటబుల్ ట్రస్ట్ సంస్థను రేపల్లె మండలం నల్లూరిపాలెం గ్రామంకు చెందిన వీరవల్లి శివరామకృష్ణ 2016 లో స్థాపించారు. రేపల్లెలోని నిరుద్యోగ యువత కోసం నల్లూరిపాలెం చారిటబుల్ ట్రస్ట్ సంస్థ విజయవాడ, హైదరాబాద్, విశాఖపట్నం లాంటి సిటీలలో ఉన్న ప్రైవేట్ కంపెనీల తో మాట్లాడి 3 సార్లు జాబ్ డ్రైవ్ నిర్వహించి 50మందికి ఉపాధి కల్పించి వారు ఉన్నత స్థితికి ఎదగడానికి దోహదపడింది. నల్లూరిపాలెం చారిటబుల్ ట్రస్ట్ సంస్థ స్థాపించినప్పటి నుంచి ఇప్పటి వరకు 70 మంది విద్యార్థులకు చదువుకోవడానికి సుమారు 10లక్షల రూపాయలు ఖర్చు చేసి వారి జీవితాల్లో వెలుగు నింపింది. నల్లూరిపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాఠశాల విద్యార్థులకు అవసరమైన టీ షర్టులు , పుస్తకాలు స్టేషనరీ ఐటమ్స్ ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ పరిధిలోని కాలనీలో అనేక చోట్ల బోరింగ్ పంపులు 10మెటల్ రోడ్లు, 50 సిమెంట్ బల్లలు, రూ.20లక్షల తో నల్లూరుపాలెంలో మహా మహాప్రస్థానం, పార్క్, మంచినీటికి కొరత లేకుండా చెరువును శుభ్రం చేశారు. నల్లూరిపాలెంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఎందరో నిరుపేదలైన చిన్నారులకు, వృద్ధులకు వైద్య ఖర్చులకు నగదు సాయం అందజేశారు.



నష్టాల బాటలో ఇటుకల పరిశ్రమ

- పెరిగిన ముడి సరుకుల ధరలు
- పడిపోయిన కొనుగోళ్లు
- ఆందోళనలో బట్టీల యాజమానులు, వ్యాపారులు



ప్రజాశక్తి-వేమూరు

ఇటుకల తయారీ పరిశ్రమలు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నాయి. ఇటుకలు కొనుగోళ్లు చేసే నాధుడే కనిపించడం లేదు. దీంతో పెడుబడులు రాక..వడ్డీలు పెరిగి నష్టాలకు గురికావాల్సి వస్తుందని ఇటుక భట్టి యజమానులు, వ్యాపారులు ఆందోళనకు గురవుతున్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఇటుక తయారీ పరిశ్రమలు ఉన్నాయి.ఒకప్పుడు కొల్లూరు ఇటుక అంటే ఇతర రాష్ట్రాల్లో కూడా పేరు ఉండేంది. నాణ్యతా ప్రమాణాలతో తయారు చేయడం, అత్యంత మన్నిక కలిగి ఉండటం, గహ నిర్మాణానికి అనుకూలంగా ఉండటం, ఏళ్ల తరబడి శాశ్వతంగా ఉంటుందని నమ్మకంతో ఇక్కడి ఇటుకలను దూర ప్రాంతాల వారు సైతం కొనుగోలు చేసేవారు. ప్రస్తుత పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. నాణ్యత ప్రమాణాలు పాటించి అధిక వ్యయ ప్రయాసలకు ఒర్చి ఇటుకలను తయారు చేస్తున్నారు. అయితే ఇతర ప్రాంతాల్లో నాణ్యత లేకపోయినా రాయి సైజు పెద్దగా ఉండి తక్కువ ధరకు లభిస్తుండటంతో ఇక్కడి ఇటుకు ప్రాధాన్యత తగ్గింది. ప్రస్తుత ధరలకు అనుగుణంగా లక్ష ఇటుకలు తయారు చేస్తే లక్ష రూపాయలు నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని యజమానులు వాపోతున్నారు. ఇసుక తయారీలో వినియోగించే ఊక , బొగ్గు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రస్తుతం లారీ బొగ్గు రూ.4 లక్షల ధర పలుకుతుంది. ఇతర సామగ్రి ధరలు కూడా విఫరీతంగా పెరిగిపోయాయి. ఒకప్పుడు ఒక్కోబట్టిలో 70 నుంచి 100 మంది కూలీలు ఇటుక తయారీ పనిలో ఉండేవారు. ప్రస్తుతం 10 నుంచి 20 మంది కూడా అందుబాటులో ఉండటం లేదు. ఈ కారణంగా యజమానులు కూడా ఇటుకల తయారీకి ముందుకు రావడం లేదు. గత సీజన్‌లో కష్ణానది వరదల కారణంగా ఇటుక బట్టీలన్ని మునిగిపోయాయి. లక్షలాది రూపాయలు నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. ఇప్పుడు సీజన్ ప్రారంభం కావడంతో కూలీలకు కావలసిన షెడ్లు నిర్మించుకోవడం, మెటీరియల్ సమకూర్చుకోవడం వారికి అదనపు భారంగా మారింది. మారాయి. దీనికి తోడు ప్రసుత్తం ఇటుకల ధర తగ్గింది.

కొల్లూరు ఇటుక కనుమరుగయ్యే పరిస్థితి

నష్టాలను చవిచూస్తున్న ఇటుక పరిశ్రమ ఇదే రీతిలో కొనసాగితే భవిష్యత్తులో కొల్లూరు ఇటుక కనుమరుగయ్యే పరిస్థితి ఉంటుందని బట్టీల యజమానులు చెబుతున్నారు. ఇప్పటి వరకూ నష్టాలను సైతం భరించి వ్యాపారం చేసినట్లు తెలిపారు. పెట్టుబడులు వచ్చే మార్గం లేక ఉన్న ఆస్తులు పోయి అప్పుల ఊగులో కూరుకుపోయే పరిస్థితి ఎదురైందని వారు వాపోతున్నారు. వ్యాపారం పడిపోవడానికి ఇతర ప్రాంతాల్లో తయారు చేసిన ఇటుక ఇక్కడకు రావడమే కారణమని వారు చెబుతున్నారు. కష్ణాజిల్లా నుంచి ఇటుక రాయి బాపట్ల గుంటూరు జిల్లాలకు సరఫరా కావడంతో ఇక్కడ పరిశ్రమ మూత దశకు చేరిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటుకు పరిశ్రమపై రెవెన్యూ, మైనింగ్, విజిలెన్స్, సేల్స్ టాక్స్, పోలీస్ అధికారుల ఆగడాలను తట్టుకోలేకపోతున్నామని వారు వాపోతున్నారు. మామూలు ఇవ్వకపోతే తమపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఇతర జిల్లాల ఇటుకలను అరికట్టాలి

వెలివల గోపి, ఇటుక బట్టి యజమాని



ఇతర జిల్లాల నుంచి లారీలు, ట్రాక్టర్ల ద్వారా ఇటుకల తీసుకొస్తున్నారు. వాటి అలరికట్టాలి. లేక పోతేక ఇక్కడి యాజమానులు, వ్యాపారులు నష్టాలు ఊబిలో కూరుకు పోవాల్సి వస్తుంది. కొల్లూరు ఇటుక రాయికి ఎంతో చరిత్ర ఉంది. ఈ నేపథ్యంలో కొల్లూరు ఇటుక పరిశ్రమలను నిలబెట్టుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.


మెటీరియల్‌పై రాయితీలు ఇవ్వాలి

ఎ.శివయ్య, గాజులంక గ్రామం




కొల్లూరు ఇటుక పరిశ్రమలు సంక్షోభంలో ఉన్నాయి. వాటిని సంక్షోభం నుంచి కాపాడేందుకు ప్రభుత్వం ఇటుక తయారీకి వినియోగించే మెటీరియల్‌పై రాయితీలు అందించాలని, అధికారుల ఒత్తిడిని తగ్గించాలి. పరిశ్రమ ముందుకు కొనసాగించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇటుక పరిశ్రమ ద్వారా ప్రభుత్వానికి అందే ఆదాయం తగ్గకుండా చర్యలు తీసుకోవాలి.








ప్రపంచ కార్మిక దినోత్సవం
మే డే శుభాకాంక్షలు..
అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా
కార్మిక సోదరులకు మేడే శుభాకాంక్షలు....
సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయం
బాపట్ల.
మరియు
డాక్యుమెంట్ రైటర్స్.


MAY DAY
మేడే శుభాకాంక్షలు
అంతర్జాతీయ కార్మిక దినోత్సవం
మేడే సందర్భంగా కార్మికసోదరులకి
మేడే శుభాకాంక్షలు
వి.సాయిజ్యోతి
అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ (ఇన్‌ఛార్జ్)
బాపట్ల, బాపట్ల జిల్లా


శ్రామిక జనావళికి
మే డే శుభాకాంక్షలు...
HAPPY LABOUR DAY!
ప్రపంచ కార్మికులారా రండి ఏకం కండని ..
ఏక కంఠమున ...
ప్రభంజనంవలె పిలుపునిచ్చింది, కలసిరండని ...
కలకాలం నిలవండని,
ప్రపంచ కార్మికులు వర్ధిల్లాలని.. పిలుపునిచ్చింది.
కోరుకున్నది. నేడే ఈనాడే ఈ మేడే .....
ప్రపంచ కార్మికులు వర్ధిల్లాలని కోరుకునే
మహత్తర పర్వదినం మేడే కార్మిక వర్గ చట్టాల అమలుకు
చిత్తశుద్ధితో కృషి చేస్తున్న గౌరవనీయులు
రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి,
మరియు బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ గారికి
కృతజ్ఞతలు తెలియజేస్తూ, సకల జన కార్మికులకు
మేడే పర్వదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ..
కార్మిక వర్గ మేలుకోరే
ఓ.. అభిమాని ...
బాపట్ల నియోజకవర్గం..